



ఉండ్రాలయ్యకు ఊరేగింపు

కాకినాడ రూరల్ సూర్యారావుపేట సముద్రంలో నిమజ్జనానికి తీసుకువస్తున్న వినాయక విగ్రహం

జిల్లాలో శుక్రవారం వినాయక విగ్రహాల నిమజ్జనాలు ఉత్సాహపూరిత వాతావరణంలో నిర్వహించగా కొన్నిచోట్ల లడ్డూ పాటలు జరిగాయి.



పిఠాపురంలో నిమజ్జనానికి తీసుకువెళ్తున్న వినాయక విగ్రహం

టీచర్లకు సన్మానం



కాకినాడ పీఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రాంబాబును సత్కరిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

మిలాద్ ఉన్ నబీ వేడుకలు



పెద్దాపురంలో ర్యాలీ నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ముస్లింల ఆరాధ్య దైవం మహ్మద్ ప్రవక్త జన్మదినమైన మిలాద్ ఉన్ నబీని జిల్లావ్యాప్తంగా ఆనందోత్సాహాలతో శుక్రవారం నిర్వహించారు. మసీదుల్లో ముస్లింలు ఒకరికొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలియచేసుకున్నారు.

సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ప్రత్యేక స్థానం

- కలెక్టర్ షాన్‌మోహన్
- కాకినాడలో ఘనంగా జిల్లాస్థాయి గురుపూజోత్సవ కార్యక్రమం
- పాల్గొన్న ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు
- మొత్తం 70మంది ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం

జేఎన్టీయూకే, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): సమాజంలో ఉపాధ్యాయవృత్తికి ప్రత్యేకస్థానం ఉందని ఉపాధ్యాయులు తమవద్ద ఉన్న జ్ఞానంతో ఇతరుల జీవితాల్లో వెలుగులు నింపుతారని కలెక్టర్‌షాన్‌మోహన్ అన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూ అలూమ్నీ ఆడిటోరియంలో శుక్రవారం గురుపూజోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లావిద్యాశాఖాధికారి పిల్లిరమేష్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో కలెక్టర్ షాన్‌మోహన్, కాకినాడ సిటీ ఎమ్మెల్యే కొండబాబు, పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, ప్రత్తిపాడు ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీలు రాజశేఖర్, పద్మశ్రీ, ట్రైనీ కలెక్టర్ మనీషా, సమాచార పౌరసంబంధాలశాఖ డీడీ నాగార్జున ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతిని పురస్కరించుకుని ఆయన విగ్రహానికి ముఖ్యఅతిథులు పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ తన తల్లిదండ్రులు ఇద్దరూ ఉపాధ్యాయులేనని, తన తొలి గురువు తల్లి, చివరి గురువు తండ్రి అన్నారు. తన చిన్ననాటి వయసులో ఆగస్టు 15, జనవరి 26, సెప్టెంబరు 5 తేదీల్లో తన కుటుంబంలో పండగ వాతావరణం నెలకొనేదన్నారు. విద్యార్థులు ఉత్తమ మార్గాల వైపు పయనించేలా ఉపాధ్యాయులు బోధన ద్వారా కృషి చేయాలని సూచించారు. సమాజంలో ఎంతోమంది జీవితాల్లో మార్పు తీసుకురావడంలో కీలక పాత్ర పోషిస్తున్న ఉపాధ్యాయ వృత్తి ఉత్తమమైనదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తోందని తెలిపారు. జిల్లాలో డీఎస్సీ నిర్వహణ, ఉపాధ్యాయుల బదిలీ ప్రక్రియ, 117జీవో, ఎన్‌రోల్‌మెంట్ వంటి వాటిని ప్రణాళిక ప్రకారం చేపట్టారని డీఈవో రమేష్‌ను కలెక్టర్ అభినందించారు. ఎమెల్సీ రాజశేఖర్ మాట్లాడుతూ కుల, మత రాజకీయాలకు అతీతంగా జరిపే ఏకైక పండుగ ఉపాధ్యాయ దినోత్సవమన్నారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ విద్యావేత్తగా, తత్వవేత్తగా ఉపరాష్ట్రపతిగా డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ దేశానికి ఉత్తమ సేవలు అందించారన్నారు. అనంతరం ఎమ్మెల్యే వనమాడి మాట్లాడుతూ సమాజంలో మానవుడు బతకడానికి కనీస అవసరాలైన గాలి, నీరు, తిండి, దుస్తులు ఎంత అవసరమో విద్యకూడా అంతే అవసరమన్నారు. ఎమ్మెల్యే చినరాజప్ప మాట్లాడుతూ బతుకు నేర్పే వృత్తిగా సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి మంచి గుర్తింపు ఉందన్నారు. అతిథులు జిల్లాలో ఎంపికైన 70మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేసి సత్కరించారు. కాకినాడ పీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జ్యోతుల రాంబాబు, కాకినాడ ఆనంద భారతి మున్సిపల్ ఉన్నతపాఠశాల ప్రధానోపాధ్యాయిని జె.సుబ్బలక్ష్మి, ఇంజరం జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీధర్, కట్టమూరు జడ్పీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయిని మీనా మాధురి, డి.వీరన్న, కె.సాయిబాబు తదితరులను అతిథులు సత్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలెక్టర్, డీఈవో సత్కరించారు. కార్యక్రమంలో డీసీఈబీ కార్యదర్శి వెంకట్రావు, డీవైఈవోలు, ఎంఈవోలు, ఉపాధ్యాయ సంఘాలు, ప్రధానోపాధ్యాయులు, బంగారాజు, రవిరాజు, నూకరాజు, శ్రీనివాసరావు, చిన్నా, భాగ్యరాజు, వెంకటరమణ, మాచరరావు తదితరులు పాల్గొన్నారు.



ఆకాశమే హద్దు!

భవన నిర్మాణాల ఎత్తు 24 మీటర్లకు పెంచే యోచన

నగరాల్లో భవనాల ఎత్తు పెరగనుంది. అవసరమైతే పెంచుకోవడానికి, కొత్తవి పెంచి కట్టుకోవడానికి అవకాశం కలగనుంది. రాష్ట్రంలో భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18 మీటర్ల నుంచి 24 మీటర్లకు పెంచనున్నట్లు పౌరసంబంధాలశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తాజాగా ప్రకటించారు.దీనిపై శాసనసభలో ప్రత్యేక బిల్లును ప్రవేశపెట్టనున్నారు. ప్రభుత్వ నిర్ణయంతో పెరుగుతున్న జనాభా అవసరాలు, పట్టణాభివృద్ధి దృష్ట్యా ఎంతో ఉపయోగకరంగా మారనుంది.

(రాజమహేంద్రవరం/ కాకినాడ కార్పొరేషన్- ఆంధ్రజ్యోతి)

ఇక అపార్ట్‌మెంట్లు ఆకాశహర్మ్యాలు కానున్నాయి. ఇప్పటి వరకూ ఐదంతస్తుల వరకే భవన నిర్మాణాలకు అనుమతి ఉంది. అంటే 18 మీటర్ల కంటే ఎత్తు దాటి అపార్టుమెంట్లు,ఇతర భవనాలు నిర్మించకూడదు. 18 మీటర్ల ఎత్తు దాటితే వాటిని హైరైజ్డ్ భవనాలు కింద పరిగణిస్తారు. వాటి నిబంధనలు,అనుమతులు వేరేగా ఉంటాయి. కూటమి ప్రభుత్వం ఈ నిబంధన సడ లించనుంది. సాధారణ అపార్ట్‌మెంట్ల ఎత్తు 24 మీటర్ల వరకూ పెంచనుంది.అప్పుడు ఏడం తస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం ఉంటు ంది.

జనం ఎదురుచూపులు..

ఇంత వరకూ సుమారు 400 గజాల్లో నాలుగంతస్తులు, 600 గజాల్లో ఐదంతస్తులు కట్టుకునేందుకు అనుమతి ఉంది. భవనాల ఎత్తును 24 మీటర్లకు పెంచడం వల్ల ఏడంతస్తులు కట్టుకోవచ్చు. స్థలం ఎక్కువ ఉంటే హైరైజ్డ్ భవనాలు నిర్మించుకోవచ్చు. హైరైజ్డ్ నిర్మాణాలకు అదనంగా సిటీ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్, అర్బన్ డెవలప్ మెంట్ అథార్టీలు, రేలా అనుమతులతో పాటు ఎయిర్‌ఫోర్ట్, ఫైర్ డిపార్ట్‌మెంట్ల అనుమతులు తీసుకోవాల్సి వస్తుంది. ప్రభుత్వ నిర్ణయం కోసం అంతా ఎదురుచూస్తున్నారు. భూమి విలువ పెరగడం వల్ల హైరైజ్డ్ భవన నిర్మాణాలపై ప్రభుత్వం దృష్టి సారిస్తోంది.దీంతో తక్కువ భూమిలో ఎక్కువ మంది నివసించే అపార్టుమెంట్ కల్చర్ మరింత పెరగనుంది.

కీలక మలుపు..

భవనాల గరిష్ఠ ఎత్తు పరిమితిని 18మీటర్ల నుంచి 24మీటర్లకు పెంచే నిర్ణయం రాష్ట్ర పట్టణాభివృద్ధిలో కీలక మలుపుగా భావించవచ్చు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో కాకినాడ, రాజమహేంద్రవరం కార్పొరేషన్లతో పాటు కాకినాడ జిల్లాలో నాలుగు, కోనసీమలో మూడు, తూర్పుగోదావరి జిల్లాలో రెండు మునిసిపాలిటీలు ఉన్నాయి. తాజా నిర్ణయంతో పట్టణాల్లో మౌలిక వసతుల విస్తరణతో పాటు నివాస, వాణిజ్య అవసరాలకు సమతుల్యత కలుగుతుంది. బిల్లు శాసనసభలో ఆమోదం పొందిన వెంటనే రాష్ట్ర నిర్మాణ రంగం కొత్త దిశగా పయనించే అవకాశముందని నిపుణులు భావిస్తున్నారు. కాకినాడ, రాజమహేంద్రవరం నగరాల్లో ఇప్పటి వరకు ఐదంతస్తుల భవనాలే ఎక్కువగా నిర్మించారు. ఇకపై ఏడంతస్తుల భవనాలు వచ్చే అవకాశాలున్నాయి. ఎత్తు మార్పు నిర్ణయం వల్ల కార్పొరేషన్లు, మున్సిపాల్టీలోని పట్టణ ప్రణాళికలో మార్పులు తప్పనిసరి కానున్నాయి. భవన సముదాయాల ఎత్తు పెరగనుండడంతో ట్రాఫిక్, పార్కింగ్‌తోపాటు నీరు, విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల పెంపు వంటి అంశాలను దృష్టిలో ఉంచుకుని కొత్త ప్రణాళికలు సిద్ధం చేయాల్సిన అవసరం ఉంది.

తాజా నిర్ణయంతో లాభాలు

నగరాభివృద్ధికి ఊతం : భూమి వినియోగం సమర్థవంతం అవుతుంది.
గృహావసరాలు తీర్చడం : మరిన్ని ప్లాట్లు, అపార్టుమెంట్ల నిర్మాణానికి అవకాశం.
వాణిజ్య వృద్ధి : షాపింగ్‌మాల్స్, ఐటీ టవర్స్, వాణిజ్య సముదాయాలకు మార్గం.
ఆర్థిక లాభాలు : పెట్టుబడులు పెరిగి ఉపాధి అవకాశాలు ఎక్కువగా కలగనున్నాయి.

5 కాదు..ఏడంతస్తులు

హైదరాబాద్, వైజాగ్ వంటి నగరాల్లో ఇప్పటికే ఆకాశహర్మ్యాలు నిర్మించారు. 150 మీటర్ల ఎత్తు వరకూ అనుమతి స్తున్నారు. 35 నుంచి 40 అంతస్తులు నిర్మిస్తున్న సంగతి తెలిసిందే. మన ప్రాంతాల్లో అంత ఎత్తులో భవనాలు నిర్మించడానికి గతంలో అనుమతులు లేవు. సాధారణ అపార్ట్‌మెంట్లను ఐదంతస్తుల వరకే పరిమితం చేశారు..తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సాధారణ అపార్ట్ మెంట్లను ఏడంతస్తుల వరకూ నిర్మించుకునే అవకాశం కల్పించనుంది. ఈ మేరకు త్వరలో ఉత్తర్వులు విడుదల చేయనున్నారు. రాజమహేంద్రవరంలో సుమారు 8 వరకూ హై రైజ్డ్ భవనాలు ఉన్నట్టు అధికారుల కథనం.

- ఇప్పటి వరకూ ఐదంతస్తులే
- 18 మీటర్లకే అనుమతి
- ఇక ఏడంతస్తుల మేడలు
- ఇక అన్నీ హైరైజ్డ్ భవనాలే
- త్వరలో శాసనసభలో చర్చ
- ఎస్ఎఫ్‌టీపై అయోమయం
- పట్టణాభివృద్ధికి దోహదం
- నిర్మాణ రంగానికి కొత్త ఊపు
- మారనున్న పట్టణ ప్రణాళిక

'మన మిత్ర-వాట్సాప్ గవర్నెన్స్‌పై అవగాహన కల్పించాలి

- నేడు జిల్లావ్యాప్తంగా ర్యాలీలు నిర్వహించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం మన మిత్ర వాట్సాప్‌గవర్నెన్స్ ద్వారా 709రకాల సేవలు ప్రవేశపెట్టిందని, వీటిని వినియోగించుకునేలా ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలనికలెక్టర్ షాన్‌మోహన్ ఆదేశించారు. కాకినాడలోని తనక్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం మండలస్థాయి అధికారులతో ఆయన టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత నెల 15నుంచి మన మిత్ర 9552300009 వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా 709 రకాల ప్రభుత్వ సేవలను పౌరులకు ప్రభుత్వం అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ సేవలను ప్రజలు అత్యధిక సంఖ్యలో వినియోగించుకునేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ సేవలు పొందడంలో పౌరులకు సాంకేతిక సమస్యలు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక పర్యవేక్షణ చేయాలన్నారు.ప్రభుత్వ కార్యాలయాలకు ప్రజలు వెళ్లాల్సిన అవసరం లేకుండా పౌరులు వాట్సాప్‌ద్వారానే సేవలు పొందవచ్చునన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ వినియోగించుకునేవారి శాతం పెరగాలన్నారు. శనివారం అన్ని గ్రామస్థాయిలో విధిగా ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ ర్యాలీలో మండల తహసీల్దార్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ప్రజాప్రతినిధులు, పాల్గొనాలన్నారు. మన మిత్ర వాట్సాప్ గ్రూపు ద్వారా పైన పేర్కొన్న నెంబరుకు వాట్సాప్‌లో హాయ్ అని మెసేజ్ చేస్తే మెనూ తెరుచుకుంటుందని, అందులో మీకు కావాల్సిన సర్వీసులు, సేవల వివరాలు నమోదు చేయాలని అన్నారు. వీటి ద్వారా అన్న క్యాంటీన్ల ఫుడ్ టోకెన్లు, దీపం కనెక్షన్, బియ్యం పొందిన వారి వివరాలు, ఈకేవైసీ స్టేటస్, హెల్త్ కార్డు సర్వీస్, ఎన్టీఆర్ విద్యా సేవ కార్డుల వివరాలు, తల్లికి వందనం స్టేటస్‌తోపాటు విద్యుత్ బిల్లుల పేమెంట్‌సేవలు పొందవచ్చునన్నారు. ఈ సేవలను రియల్ టైమ్ బేసిస్‌లో మానిటర్ చేస్తారన్నారు.



నిధుల వరద!

భారీ వర్షాలు, ఏలేరు, సుద్దగడ్డ వరదల కారణంగా చిన్నాభిన్నమైన పంట కాలువలు, చెరువుల మరమ్మతులు, గండ్లు పూడ్చివేత పనులకు మోక్షం లభించింది. ఇప్పటికే అత్యవసర పనులు నిర్వహించగా, మిగిలిన పనులను పూర్తి చేసేందుకు నిధులు కేటాయిస్తూ రాష్ట్ర కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు 18.75 కోట్లతో 222 పనులు ఆమోదించారు. దీంతో ఈ పనులు త్వరలోనే ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. (పిఠాపురం-ఆంధ్రజ్యోతి)

222 పనులకు గ్రీన్‌సిగ్నల్

ఇరిగేషన్ అధికారులు తయారు చేసిన ప్రతిపాదనలను కాకినాడ జిల్లా కలెక్టర్ సగిలి షాన్‌మోహన్ ప్రభుత్వానికి నివేదించారు.222 పనులను తక్షణం చేపట్టాలని, లేకుంటే సాగునీటి సరఫరాలో ఇబ్బందులు తప్పవన్నా రు. పిఠాపురం, జగ్గంపేట నియోజకవర్గాలతో పాటు రాష్ట్రంలోని మరికొన్ని నియోజకవర్గాల్లో సెప్టెంబరు నెల లో వచ్చిన వరదలకు జరిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచు కుని ఇరిగేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, వరద నష్ట నివారణ, పునరుద్ధరణ, గండ్లు పూడ్చివేత పనులను చేపట్టేందుకు గురువారం జరిగిన రాష్ట్ర కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారు.

- వరద పనులకు మోక్షం
- రూ.18.70 కోట్లతో 222 పనులు
- ఆమోదం తెలిపిన రాష్ట్ర మంత్రివర్గం
- ఏలేరు, పీబీసీ, పుష్కరలో పనులు

అప్పట్లో అత్యవసర పనులకే..

క్లోజర్ సమయంలో ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులతో పాటు గండ్లు పూడ్చివేత పను ల నిమిత్తం నిధులు అవసరమని ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి నివేదించారు. అయితే ప్రభుత్వం మాత్రం ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్, గుర్రపుడెక్క పనులకు మాత్రమే అనుమతించి గండ్లు పూడ్చివేత పనులకు నిధులు విడుదల చేయలేదు. ఈ నిధులతో పనులు చేపట్టి అరకొరగానే పూర్తి చేయడంతో రైతుల్లో ఆందోళన వ్యక్తమైంది. ఈ పనులు చేపట్టకపోతే సార్వాలో ఇబ్బందులు తప్పవని రైతులు ఆందో ళనలో ఉన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సుద్దగడ్డకు వచ్చిన వరదలతో పీబీసీ పరిధిలో 3 వేల ఎకరాల్లో పంట పొలాలు ముంపునకు గురయ్యాయి. దీంతో పనులు అత్యవసరంగా చేపట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది.

ఏలేరు రిజర్వాయర్ నుంచి గత ఏడాది సెప్టెంబరు నెలలో 48 వేల క్యూసెక్కులకుపైగా నీటిని కాలువలకు విడుదల చేయడంతో వరద నీటి ఉధృతికి ఏలేరు, పీబీసీ కాలువలకు ఎక్కడికక్కడ గండ్లుపడ్డాయి.పలుచోట్ల కాలువల గట్లు కొట్టుకుపోయాయి. అదే సమయంలో సుద్దగడ్డకు వరదలు రావడంతో పరిస్థితి మరింత తీవ్రమైంది. ఏలేరు, పీబీసీ కాలువలకు, మెట్ట గ్రామాల్లోని చెరువులకు 280 చోట్ల గండ్లు పడ్డాయి. వీటిలో రెండు విడతల్లో 67 గండ్ల పూడ్చివేత పనులను పూర్తి చేశారు. మిగిలిన పనులను చేపట్టేందుకు ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ లో రైతులకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించ డంతో పాటు అధిక వర్షాలు కురిసినా ముంపు బెడద లేకుండా ఉండేందుకు ఏలేరు, పీబీసీ, సుద్దగడ్డ, పుష్కర కాలువలు, చెరువులకు పడిన గండ్లను పూడ్చేందుకు రూ. 18.70 కోట్లతో 222 పనులు చేపట్టాలని ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదించారు. గొల్లప్రోలు, పిఠాపురం, కొత్తపల్లి, కిర్లంపూడి, జగ్గంపేట తదితర మండలాల పరిధిలో ఏలేరు, పీబీసీ, సుద్దగడ్డ కాలువలకు పడిన 211 గండ్ల పూడ్చివేతకు రూ.18.16 కోట్లు, కిర్లంపూడి మండల పరిధిలో పుష్కర కాలువలకు పడిన 11 గండ్ల పూడ్చివేతకు రూ.54 లక్షలు అవసరమని అధికారులు అంచనాలు తయారు చేశారు.

పనుల నిర్వహణ సాధ్యమేనా?

సాధారణంగా గండ్లు పూడ్చివేత, కళింగల్స్, స్లూయిస్‌లు, రెగ్యులేటర్లకు మరమ్మతులు, కాలువల పటిష్టత తదితర పనులను కాలువలకు నీరు విడుదల నిలిపివేసిన సమయంలో చేపట్టాల్సి ఉంది. ఇందుకు తగ్గట్టుగా గత ఏడాది నవంబరు, ఈ ఏడాది ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో ఇరిగేషన్ అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ పనులతో పాటు ఈ పనులు అత్యవసరంగా నిర్వహించాలని నివేదించారు. అయితే క్లోజర్ పనులకే అప్పట్లో ఆమోదం తెలిపి మిగిలిన వాటిని విస్మరించారు. దీంతో కలెక్టర్ ద్వారా పనుల ఆవశ్యకతను వివరిస్తూ నివేదిక పంపారు. ఇరిగేషన్ శాఖ పనులు ఆమోదించినా నిధులు విడుదలకు ఆర్థిక శాఖ మోకాలడ్డడంతో ఈ అంశం కేబినెట్‌కు వెళ్లింది. పనుల ఆవశ్యకతను దృష్టిలో ఉంచుకుని కేబినెట్ పనులను ఆమోదించడంతో పాటు తక్షణం చేపట్టాలని ఆదేశించింది. ప్రస్తుతం ఏలేరు, పుష్కర, పీబీసీ కాలువల్లో నీరు ప్రవహిస్తుండగా, చెరువుల్లోకి నీరు చేరింది. దీంతో కొన్ని పనులు మినహా మిగిలిన వాటిని సార్వా, దాళ్వా మధ్య సమయంలో చేపట్టేందుకే వీలు ఏర్పడుతుందని ఇరిగేషన్ అధికారులు అభిప్రాయపడుతున్నారు. రూ.10లక్షలలోపు పనులను నీటి సంఘాల ద్వారా నామినేషన్ పద్ధతిపై నిర్వహించేందుకు కేబినెట్ అనుమతించింది. ఈ నేపథ్యంలో పనుల నిర్వహణపై ఇరిగేషన్ ఉన్నతాధికారులు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారో వేచి చూడాల్సిందే.

ఎరువులు సక్రమంగా అందే విధంగా చర్యలు: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ),సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఖరీఫ్ సీజన్‌లో రైతులకు అవసరమైన ఎరువులు సక్రమంగా అందేలా జిల్లా, మండల స్థాయిలో మానిటరింగ్ అధికారులను, ఇంప్లిమెంట్ అధికారులను నియమిస్తూ కలెక్టర్ షాన్ మోహన్ శుక్రవారం ఆదేశాలిచ్చారు. జిల్లాలో ఎరువుల సరఫరాపై నిరంతరం నిఘా, పర్యవేక్షణ ఏర్పాటు చేసి రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు చేపట్టామన్నారు. ఎరువుల సరఫరాకు మండలస్థాయిలో తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వ్యవసాయశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. గ్రామ వ్యవసాయ సహాయకులు, వీఆర్వో, మహిళా పోలీసుల సహకారంతో ఎరువుల పంపిణీలో అవసరమైన డాక్యుమెంటేషన్‌చేసి సక్రమంగా ఎరువులు అందేలా చూడాలని ఆదేశించారు. తహసీల్దార్ ప్రతి ప్రైవేటు డీలర్ వద్ద ఒక వీఆర్వోను నియమించి ఎలాంటి అవకతవకలకు పాల్పడకుండా పర్యవేక్షించాలన్నారు. జిల్లా సహకార అధికారి, సీఈవో, పీఏసీఎస్‌ల సమన్వయంతో నిత్యం అన్ని ఎరువుల దుకాణాలు తెరిచి ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి జిల్లాస్థాయిలో కంట్రోల్‌రూమ్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలన్నారు. మండలస్థాయిలో కూడా వ్యవసాయశాఖ అధికారులు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి రైతులకు

కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలి

జిల్లాలో ఎవరైనా ఎరువులను కృత్రిమ కొరత సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఎరువులను బ్లాక్‌మార్కెటింగ్‌కు తరలిస్తే దాడులు చేయాలన్నారు. మండల ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో ఎస్‌హెచ్‌వో, ఎంఏవో, తహసీల్దార్లు, ఎంపీడీవోలతో కలిసి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి ఎరువుల దుకాణాలను తనిఖీలు చేయాలన్నారు. రైతులకు ఎరువులఅవసరం ఉంటే జిల్లా వ్యవసాయశాఖ అధికారి కార్యాలయంలోఉన్న 8331056509 నెంబరులో ఫిర్యాదు చేయాలన్నారు. శనివారం 600 మెట్రిక్ టన్నుల యూరియా జిల్లాకు సరఫరా అవుతుందన్నారు.

నేడు బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ పర్యటన

కార్పొరేషన్(కాకినాడ),సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర బీసీ కోపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ రెడ్డి అనంతకుమారి జిల్లాలో శనివారం పర్యటించనున్నారు. కార్యక్రమంలో భాగంగా మధ్యాహ్నం 3గంటలకు కాకినాడ డీఆర్‌డీఏ ఆఫీస్‌లో ఆమె అధ్యక్షతన ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఉన్న బీసీ కులాల కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్స్ బీసీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాసరావు సిబ్బందితో సమావేశం జరగనుంది. సమావేశం అనంతరం సాయంత్రం 5గంటలకు మీడియా సమావేశం నిర్వహించనున్నారు.

అంచనాలకు ఆమోదం 7
- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస పనులపై పాలక మండలి సమావేశం

7 ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు

రేపు చంద్ర గ్రహణం 6


తూర్పుగోదావరి జిల్లా రాజమండ్రిలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా మంత్రి కందుల దుర్గేష్, కలెక్టర్ ప్రశాంతి చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఉపాధ్యాయుడు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నల్లమిల్లి, ఆదిరెడ్డి వాసు పాల్గొన్నారు.



కాకినాడ జిల్లా కాకినాడలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా సిటీ ఎమ్మెల్యే కొండబాబు, కలెక్టర్ షాన్‌మోహన్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయుడు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.


డాక్టర్ బీఆర్ కోనసీమ జిల్లా అమలాపురంలో జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ మహేష్‌కుమార్ చేతులమీదుగా ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న ఉపాధ్యాయురాలు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై తిరుగుతూ.. సమస్యలు తెలుసుకుంటూ

● వరద ముంపు గ్రామాల్లో రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష పర్యటన


వడ్డిగూడెంకు ట్రాక్టర్‌పై వెళ్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

వీఆర్‌పురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అల్లూరి జిల్లాలోని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీషదేవి శుక్రవారం ముంపు గ్రామాల్లో ట్రాక్టర్‌పై పర్యటిస్తూ ... బాధితుల సమస్యలు తెలుసుకున్నారు. ప్రధానంగా ముంపులో ఉన్న వడ్డిగూడెంకి వెళ్లి గ్రామ స్థులతో మాట్లాడారు. ఈ సం దర్భంగా వారంతా మాట్లాడుతూ గత 15 రోజు లుగా గోదావరి వరదలతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, మాకు పూర్తిస్థాయి సాయం అందలేదన్నారు. వరద సాయం ముఖ్యం కాదు, పోలవరం ప్యాకేజీ పూర్తిస్థాయిలో త్వరగా అందించాల న్నారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ బాధితులందరికీ వరద సాయం అందిస్తామని, అలాగే పోలవరం బాధితులకు నష్టపరిహారం సాధ్యమైనంత త్వరగా అందించేందుకు సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. అనంతరం బోట్‌పై శబరిగుండా ముంపులో ఉన్న రామవరం, చింతరేగుపల్లి, తదితర గ్రామాలకు వెళ్లారు. ఈమెతోపాటు మండల టీడీపీ నాయకులు, మండల స్థాయి అధికారులు, పోలీస్ సిబ్బంది కార్యకర్తలు, తదితరులు ఉన్నారు.

హైలెస్సా ....!

● నిలిచిన ఆర్టీసీ.. నెట్టిన ఆటో డ్రైవర్లు


రౌతులపూడిలో బస్సును నెడుతున్న ఆటోడ్రైవర్లు

రౌతులపూడి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రౌతులపూడి సినిమా సెంటర్ రహదారి మధ్యలో శుక్రవారం ఓ ఆర్టీసీ బస్సు నిలిచిపోయింది. ఇటీవల కాలంలో తరచూ బస్సులు మొరాయిస్తుండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. కోటనందూరు నుంచి కాకినాడ వెళుతున్న బస్సు రౌతులపూడి వచ్చింది. అక్కడ గల మహాలక్ష్మి విశ్రాంతి భవనం వద్ద ప్రయాణికులు ఎక్కిన తరువాత బస్సు కదల్లేదు. రహదారి మధ్యలో నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలిగింది. దాన్ని గమనించిన ఆటోడ్రైవర్లు హైలెస్సా అంటూ నెట్టిన దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' ఇలా క్లిక్‌మనిపించింది.

రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులు వీరే..



తూర్పుగోదావరి జిల్లా నుంచి

నక్కిన వీర రాఘవరావు, జడ్పీహెచ్‌ఎస్, కుతుకులూరు.

మోతూరి మంగరాణి, ఎంపీఎల్, లాలాచెరువు.

బత్తిన రాజరాజేశ్వరి, జడ్పీహెచ్‌ఎస్, ప్లస్ శాటిలైట్ సిటీ (బీ బ్లాక్).

కాకినాడ జిల్లా నుంచి



కోటంరాజు గాయత్రి, జడ్పీహెచ్‌ఎస్, ఏపీఎస్పీ, రమణయ్యపేట .

పతివాడ రవిశంకర్, జడ్పీహెచ్‌ఎస్, కొమరగిరి.

బొబ్బాది ప్రవీణ్‌కుమార్, జడ్పీహెచ్‌ఎస్, కొత్త పెరుమాళ్లపురం.

విజయవాడలో శుక్రవారం జరిగిన గురుపూజోత్సవంలో భాగంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ నుంచి రాష్ట్రస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకుంటున్న ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన ఉపాధ్యాయులు.

కోనసీమ జిల్లా నుంచి




గూడెపల్లి ప్రభావతి, జడ్పీహెచ్‌ఎస్, సఖినేటిపల్లి

ఆలేటి దుర్గాప్రసాద్, ఏపీ మోడల్ స్కూల్ , అవిడి

చిట్టినీది నిరంజని, జడ్పీహెచ్‌ఎస్, కాట్రేనిపాడు.

ఎడమ వైపు నుంచి..

చిరుత కలకలానికి... నిన్నటితో ఏడాది


దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో సంచరించిన చిరుత (ఫైల్)

దివాన్‌చెరువు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): దివాన్‌చెరువు అటవీప్రాంతంలో చిరుతపులి కలకలం సృష్టించి సరిగ్గా శుక్రవారంతో ఏడాది పూర్తి అయ్యింది. అప్పట్లో చిరుత సంచారంతో ఇక్కడిప్రజలు తీవ్ర ఆందోళన చెందారు. కాగా, అటవీ అధికారులు చర్యలు తీసుకోవడానికి ఇది కూడా ఒక కారణమయ్యింది. దివాన్‌చెరువు సమీపంలోని పుష్కరవనం వైపు నుంచి అర్ధరాత్రి సమయంలో ఒక చిరుత రాష్ట్ర అటవీ అకాడమీ వైపు వెళ్లిందన్న వార్తలతో ప్రజలు భయాందోళన చెందారు. దీంతో జిల్లా అటవీ అధికారులు చిరుత పులి ఉనికికి సంబంధించిన సమాచారం తెలుసుకునేందుకు బృందాలను ఏర్పాటు చేసి.. కదలికపై ట్రాప్ కెమెరాలతో నిఘా పెట్టారు. ఎట్టకేలకు దాని పాదముద్రలు గుర్తించి అటవీ అకాడమీ వెనుక గల అభయారణ్యంలో చిరుత సంచరిస్తున్నట్టు నిర్ధారించారు. అలాగే బోను కూడా సిద్ధం చేశారు. అయితే దివాన్‌చెరువు అటవీ ప్రాంతంలో కొన్నిసార్లు దాని కదలికలను ట్రాప్‌కెమెరాలలో అధికారులు కనుగొన్నప్పటికీ తప్పించుకోగలిగింది. ప్రజాభద్రతను దృష్టిలో ఉంచుకుని అటవీఅధికారులు స్థానికులకు పలు సూచనలు చేసి సహకరించాలని కోరారు. అనంతరం ఈ చిరుత కడియం వైపు వెళ్లినట్టు వార్తలు రావడంతో ఈప్రాంత ప్రజలు ఆందోళన నుంచి బయటపడ్డారని చెప్పొచ్చు.

రేపు చంద్రగ్రహణం

» తెరిచే ఉండనున్న పాదగయ క్షేత్రం
» గ్రహణ సమయంలో అభిషేకాలు
» పుష్కరిణిలో పట్టు విడుపు స్నానాలు


పిఠాపురంలోని పాదగయ క్షేత్రం



చంద్రగ్రహణం సమయంలో తెరిచి ఉంచే కుక్కుటేశ్వరుని ఆలయం

పిఠాపురం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): గ్రహణ సమయంలో రాష్ట్రంలోని అన్ని ఆలయాలను మూసివేస్తారు. కేవలం రెండు ఆలయాలు తప్ప. అందులో ఒకటి శ్రీకాళహస్తి, మరొకటి కాకినాడ జిల్లా పిఠాపురం పాదగయ క్షే త్రం. గ్రహణ సమయంలో ఈ రెండుచోట్లా పూ జలు జరుగుతాయి. రాష్ట్రంలో ఈనెల 7వ తేదీ రాత్రి చంద్రగ్రహణం ఏర్పడుతోంది.ఈ నేపథ్యం లో ఆ రోజు మధ్యాహ్నం నుంచే అన్ని ఆలయాలను మూసివేస్తున్నట్టు ఇప్పటికే ప్రకటించారు. ఈ సమయంలో పిఠాపురం పాదగయ క్షేత్రం లో ఉన్న కుక్కుటేశ్వరస్వామి దేవస్థానం తెరిచే ఉంటుంది. ఇక్కడ యథావిధిగా పూజలు జరుపుతారు. గ్రహణ సమయంలో కుక్కుటేశ్వరస్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. గ్రహణ పట్టు, విడుపు సమయాల్లో పాదగయ పు ష్కరిణిలో భక్తులు స్నానాలు ఆచరిస్తున్నారు. పురాతన కాలం నుంచీ వస్తున్న సం స్కృతీ, సంప్రదాయాలకు అనుగుణంగా పాదగయ క్షేత్రా న్ని గ్రహణ సమయంలో తెరిచి ఉంచి కుక్కుటేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నామని ఆలయ వేద పండితులు, కార్యనిర్వహణాధికారి కాట్నం జగన్మోహన శ్రీనివాస్ తెలిపారు.

అప్పనపల్లి ఆలయం మూసివేత

మామిడికుదురు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ నెల 7వ తేదీన సంపూర్ణ చంద్రగ్రహణం సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి శ్రీబాలబాలాజీ ఆలయాన్ని మూసివేస్తున్నట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. ఆదివారం మధ్యాహ్నం 1 గంటలకు ఆలయాన్ని మూసివేసి సంప్రోక్షణ, ప్రత్యేక పూజల అనంతరం సోమవారం ఉదయం 10 గంటలకు ఆలయం తెరుస్తామని తెలిపారు. అప్పటి నుంచి యథావిధిగా స్వామివారి దర్శనాలు జరుగుతాయని పేర్కొన్నారు.

పాలకొల్లులో అంతర్జాతీయ చలన చిత్ర పోటీలు

మంత్రి దుర్గేష్‌కు ఆహ్వానం


మంత్రి దుర్గేష్‌కు ఆహ్వాన పత్రిక అందజేస్తున్న కమిటీ సభ్యుల

రాజమహేంద్రవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ తెలుగు సారస్వత పరిషత్ ఆధ్వర్యంలో పాలకొల్లులో అంతర్జాతీయ చలన చిత్ర పోటీలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్‌కు కమిటీ సభ్యులు శుక్రవారం ఆహ్వాన పత్రిక అందజేశారు. మంత్రిని కలిసిన వారిలో కేశిరాజు రాంప్రసాద్, అడ్డాల నాని తదితరులున్నారు.

కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా సూరిబాబు ప్రమాణ స్వీకారం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నుంచి తరలివచ్చిన మిల్లర్లు


నూతన అధ్యక్షుడు సూరిబాబును సత్కరిస్తున్న దృశ్యం

సామర్లకోట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా రైస్‌మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా వెంకటేశ్వర రైస్ ఇండస్ట్రీస్ అధినేత వల్లూరి సూర్యప్రకాశరావు (సూరిబాబు) శుక్రవారం ప్రమాణం చేశారు. సామర్లకోట ఏడీబీ రోడ్డులోని అచ్చంపేటలోని ఓ ప్రైవేటు ఫంక్షన్ హాలులో అంబటి రామకృష్ణారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యక్షులుగా పేకేటి నాగేశ్వరరావు, కొయ్య శ్రీనివాసు, సంయుక్త కార్యదర్శిగా కొత్త భైరవకృష్ణ, కోశాధికారిగా పెద్దిరెడ్డి రామానుజయ్య, కార్యదర్శిగా మొగలి అప్పారావు ప్రమాణ స్వీకారం చేశారు. రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మిల్లర్ల సమస్యల పరిష్కారానికి సూరిబాబు కృషి చేస్తారనే విశ్వాసం అందరిలోనూ ఉందన్నారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా హాజరైన రైస్ మిల్లర్లు సూరిబాబును ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు.పారిశ్రామికవేత్తలైన లలితా ఎంటర్‌ప్రైజెస్ అధినేతలు మట్టే సత్యప్రసాద్, మట్టే శ్రీనివాసు, చింతల శ్రీనివాసు, గుమ్మళ్ల సత్యనారాయణ, జొన్నాడ సందీప్, ఈదర చౌదరి, కొండపల్లి కృష్ణమూర్తి, తెలుగు రైతు కాకినాడ పార్లమెంటరీ అధ్యక్షుడు పాలకుర్తి శ్రీనుబాబు, పాలకుర్తి రవిబాబు పాల్గొన్నారు.

శిష్యుల గురుభక్తి

» పెనికేరులో ఉపాధ్యాయుడి విగ్రహం ఏర్పాటు చేసిన పూర్వ విద్యార్థులు


పెనికేరులో కుడిపూడి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

ఆలమూరు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు చెప్పిన గురువు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం పెనికేరు గ్రామంలో జైశంకర్ పేరుతో ప్రైవేట్ స్కూల్‌ను ఏర్పాటుచేసి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు చెప్పిన కుడిపూడి వెంకటరమణమూర్తి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆ స్కూల్లో చదివిన విద్యార్థులు ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఆ విగ్రహాన్ని రావులపాలెం రూరల్ సీఐ సీహెచ్ విద్యాసాగర్, ఆలమూరు ఎస్‌ఐ జి.నరేష్, టీడీపీ నాయకుడు ఈదల చినబాబు ఆవి ష్కరించి పూలమాలలు వేసి నివా ళులర్పించారు. మాస్టారు కుటుంబానికి పూర్వ విద్యార్థులు సేకరించిన రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. గురువు వెంకటరమణమూర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేసిన శిష్యులను పలువురు అభినందించారు. కార్యక్రమంలో పలువురు గ్రామస్థులు పాల్గొన్నారు.

10న 'ఈషా' యోగా పరిచయ కార్యక్రమం

అమరావతి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యోగాతో భావోద్వేగాల నియంత్రణ, మానసిక ప్రశాంతతో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలు పొందేలా ఇన్నర్ ఇంజనీరింగ్ పేరుతో సద్గురు ఓ కార్యక్రమం రూపొందించారు.ఈ కార్యక్రమం తిరుపతి, గుంటూరు, కాకినాడ, అనంతపురం, చిత్తూరు, కర్నూలు, కడప కేంద్రాల్లో తెలుగులో నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 21 నిమిషాల శాంభవి మహాముద్ర క్రియ చేయడం ద్వారా లక్షల మంది ఎన్నో ప్రయోజనాలను పొందారు. దీనికి సంబంధించిన వివరాల కోసం ఈ నెల 10న జరిగే ఉచిత పరిచయ కార్యక్రమానికి హాజరుకావాలని ఈషా ఫౌండేషన్ ఓ ప్రకటనలో తెలిపింది. isha.co/ieapt లేదా 04041896666 నంబరులో సంప్రదించాలని సూచించింది.

మరిడమ్మకు స్వర్ణ పుష్పార్చన

పెద్దాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పెద్దాపురంలోని మరిడమ్మ దేవస్థానంలో శుక్రవారం ప్రత్యేక వేదికపై అమ్మవారిని అధిష్ఠింపజేసి వేద పండితుల పవిత్ర మంత్రోచ్ఛారణల నడుమ బంగారం, వెండి పుష్పాలతో ప్రత్యేక పూజలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి ప్రసాదాన్ని భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనరు కురం విజయలక్ష్మి, సిబ్బంది రమణ, వేద పండితులు, ఆసాదులు, భక్తులు పాల్గొన్నారు.

పెరుగుతున్న డొంకరాయి జలాశయ నీటిమట్టం

మోతుగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాల కారణంగా అల్లూరి సీతారామరాజు జిల్లా డొంకరాయి జలాశయం నీటిమట్టం పెరుగుతోందని జెన్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ భాస్కరరావు తెలిపారు. శుక్రవారం నుంచి ఏ రోజైనా జలాశయం గేట్లు ఎత్తే అవకాశం ఉందని ప్రకటించారు. శుక్రవారం రాత్రి 10గంటలకు మొదటి నుంచి 3వేల క్యూసెక్కుల నీరు విడుదల చేయనున్నారు. జలాశయానికి దిగువన ఉన్న ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పశువులను జాగ్రత్తగా ఉంచుకోవాలని సూచించారు.

తగ్గుతున్న గోదావరి ఉధృతి

ధవళేశ్వరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా ధవళేశ్వరం వద్ద గోదావరి తగ్గుముఖం పడుతోంది. గురువారం అర్ధరాత్రి వరకు పెరిగిన నీటి మట్టం 11.50 అడుగులకు చేరుకుని శుక్రవారం ఉదయం 9గంటల వరకు నిలకడగా ఉంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ ద్వారా 9,41,785 క్యూసెక్కులు దిగువకు ప్రవహించింది. ఆపై క్రమంగా తగ్గుతున్న నీటి మట్టం రాత్రి 7గంటలకు 11.20 అడుగులకు చేరుకోగా 9లక్షల క్యూసెక్కులు సముద్రంలోకి ప్రవహిస్తోంది.

గణనాథుడి నాణేనికి 409 ఏళ్లు



మండపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి) స్వాతంత్ర్యం రాకముందు మన దేశాన్ని పాలించిన ఈస్ట్ ఇండియా పాలకులు మన దేశ సనాతన ధర్మ, మత ఆచారాలను కూడా ఆచరించే వారు. హిందూ దేవుళ్లపై భక్తితో వారు 1616వ సంవత్సరంలో వినాయకుడు ప్రతిమను రెండనాల రాగి నాణెంపై ముద్రించి హిందూ ధర్మం పట్ల వారి కున్న భక్తిని చాటుకున్నారు. ఆనాటి నాణం నేటికీ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం అంగర గ్రామానికి చెందిన తోరాటి నాగభూషణం వద్ద భద్రంగా ఉంది. ఆ నాణేనికి నేటికి 409 సంవత్సరాలు వయస్సు ఉండడం గమనార్హం.

10న జడ్పీ స్థాయీ సంఘాల సమావేశం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా పరిషత్ స్థాయీ సంఘాల సమావేశాలను ఈ నెల 10వ తేదీ ఉదయం 10.30 గంటల నుంచి నిర్వహిస్తామని జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు తెలిపారు. పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలకు లోబడి కాకినాడలోని జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఈ సమావేశాలు ఏర్పాటు చేశామన్నారు. ప్రజాప్రతినిధులు, సంబంధిత స్థాయీ సంఘాల సభ్యులు, అధికారులు విధిగా హాజరు కావాలని సీఈవో శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు.

10 నుంచి 'యోగా ఇన్నర్ ఇంజనీరింగ్'

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 10 నుంచి 16వ తేదీ వరకు కాకినాడలో యోగా ఇన్నర్ ఇంజనీరింగ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.నగరంలోని కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రాచీన యోగశాస్త్రాల సారాంశమైన ఇన్నర్ ఇంజనీరింగ్ మనిషి సంపూర్ణ శ్రేయస్సుకు బాటలు వేసి ఆనందకరమైన జీవితానికి దోహదపడుతుందన్నారు. రామకృష్ణారావుపేటలోను, వెంకటరత్నపురం గాంధీభవన్‌లోను ప్రతిరోజూ ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు జరుగుతుందన్నారు. 10వ తేదీ సాయంత్రం పరిచయ కార్యక్రమం ఉంటుందని, ఆసక్తిగల వారు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 96181 18529 నెంబరును సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

రూ.1.11 లక్షలు పలికిన గణపతి లడ్డూ


రూ. 1.11 లక్షలకు లడ్డూను కైవసం చేసుకున్న వీరబాబు

యానాం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): యానాం పిల్లారాయవీధిలో కొలువైన శ్రీపిళ్లైయ్యార్ స్వామి (లక్ష్మీగణపతి) నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా భక్తులు ఏర్పాటు చేసిన లడ్డూకు శుక్రవారం వేలం పాట నిర్వహించారు. 54 కిలోల లడ్డూను రూ.1.11లక్షలకు వీరబాబు(మసాల) కైవసం చేసుకున్నాడు. స్థానిక త్యాగరాయవీధిలోని శ్రీశివరాజ విద్యాగణపతికి పెన్నులతో పూజ నిర్వహించారు. పూజల అనంతరం పెన్నులను విద్యార్థులకు పంపిణీ చేశారు.

అవంతినగర్‌లో రూ.1.05 లక్షలు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం శివారు అవంతినగర్‌లో ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సిద్ధి, బుద్ధి గణపతి మండపంలో స్వామివారికి 45 కిలోల లడ్డూ సమర్పించారు. శుక్రవారం నిర్వహించిన వేలంలో కాలనీవాసులు దానిని రూ.1.05 లక్షలకు సొంతం చేసుకున్నారు.అనంతరం భారీ అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో తిమ్మాపురం సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ, జనసేన సీనియర్ నాయకులు మాదారపు తాతాజీ, శ్రీను, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


లడ్డూను సొంతం చేసుకున్న అవంతీనగర్ వాసులు

అంచనాలకు ఆమోదం..

- అన్నవరం దేవస్థానంలో కార్తీకమాస పనులపై పాలకమండలి సమావేశం
- రూ.5.13 కోట్లతో గ్రావెల్‌రోడ్డు, వన్‌వే, పార్కింగ్ సౌకర్యాలకు అంచనాలు
- రూ.5.25 లక్షలతో తాత్కాలిక మరుగుదొడ్లు
- రూ.10 లక్షలతో వాటర్‌ప్రూఫ్ షామియానాలు ఏర్పాటు
- గిరి ప్రదక్షిణకు రూ.7.70 లక్షలతో పనులు
- తెప్పోత్సవానికి రూ.5.50 లక్షలతో వివిధ పనులకు చైర్మన్ గ్రీన్‌సిగ్నల్

అన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఈ ఏడాది కార్తీకమాసంలో భక్తుల రద్దీ దృష్ట్యా చేపట్టాల్సిన సౌకర్యాలు, ఇతర అవసరాల ప్రధాన అజెండాలుగా శుక్రవారం నిర్వహించిన పాలకమండలి సమావేశంలో చైర్మన్ రోహిత్ ఆమోదం తెలిపారు. ప్రధానంగా రూ.5.13 కోట్లతో హరిహర మార్గ్ పార్కింగ్, వన్‌వేగా హరిహరసదన్ వెనక నుంచి సత్యగిరి జంక్షన్‌కు వన్‌వేగా ఆదిశంకర్ మార్గ్ మీదుగా కొండదిగువకు వెళ్లేందుకు అవసరమైన గ్రావెల్ రోడ్డు వేయడానికి తయారుచేసిన అంచనాలకు చైర్మన్ ఆమోదం తెలిపారు. కార్తీకపౌర్ణమి రోజున లక్షలాది భక్తులు గిరిప్రదక్షిణకు విచ్చేయనున్న నేపథ్యంలో స్టాల్స్ ఏర్పాటు, పలుచోట్ల టెంట్‌లు, షామియానాలు, టాయిలెట్ల ఏర్పాటుకు రూ.7.70 లక్షల అంచనా పనులకు ఆమోదం లభించింది. క్షీరాబ్ది ద్వాదశిరోజున స్వామివారి తెప్పోత్సవం జరగనున్న నేపథ్యంలో రూ.5.50 లక్షలతో వివి పనులు చేపట్టేందుకు, రూ.5 లక్షలతో పడమర రాజగోపురం వద్ద షెడ్లు, గ్రీన్ మ్యాట్, హోల్డింగ్ పాయింట్ల ఏర్పాటుకు, రూ.10 లక్షలతో రూ.2వేలు, రూ.1500 వ్రతమండపాల వద్ద వెయిటింగ్ హాల్స్, వాటర్ ప్రూఫ్ షామియానాల ఏర్పాటుకు తయారుచేసిన అంచనాలకు గ్రీన్‌సిగ్నల్ లభించింది. రూ.28 లక్షలతో కొండదిగువ పవర్ హౌస్ నుంచి కొండపైకి విద్యుత్ సరఫరా కోసం అండర్‌గ్రౌండ్ కేబుల్ ద్వారా రెండో లైన్ ఏర్పాటుకు, రూ.11.50 లక్షలతో అన్నవరం దత్తత దేవాలయమైన బలిఘట్టం సత్యదేవుడి ఆలయంలో వివిధ అభివృద్ధి పనులకు, రూ.5.25 లక్షలతో వివిధ ప్రాంతాల్లో 22 తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటుకు, రూ.4.50 లక్షలతో పాత, కొత్త సెంటినరీ కాటేజీల వద్ద స్విచ్‌బోర్డుల ఏర్పాటు తదితర పనులను ఆమోదించారు. ఇటీవల పలు వ్యాపార లైసెన్స్ హక్కుల కోసం నిర్వహించిన బహిరంగవేలంలో హెచ్చుపాటలను, దేవస్థానానికి అవసరమైన పనులకు లోయెస్ట్ టెండర్లు ఆమోదించారు. సమావేశంలో ఈవో సుబ్బారావు, అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్లు, ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

కార్తీకమాస ఏర్పాట్లపై సమీక్ష



అన్నవరంలో కార్తీకమాస ఏర్పాట్ల సమీక్షలో పాల్గొన్న ఈవో, చైర్మన్

అన్నవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసంలో సత్యదేవుడి సన్నిధికి అసంఖ్యాకంగా విచ్చేసే భక్తులకు చేపట్టాల్సిన సౌకర్యాలపై ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్ అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రధానంగా ఈ ఏడాది కార్తీకమాసంలో 13 రోజులు పర్వదినాలుగా, మిగిలిన రోజులు సాధారణ రోజులుగా గుర్తించారు. పర్వదినాల్లో రోజుకు లక్షపైబడి, సాధారణ రోజుల్లో సుమారు 50వేలమంది భక్తులు విచ్చేస్తారని అంచనా వేశారు. భక్తులకు ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా వ్రతం, దర్శనం త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఈవో సూచించారు. పర్వదినాల్లో ఒంటిగంట నుంచి వ్రతాలు, 2గంటల నుంచి సర్వదర్శనాలు ప్రారంభించాలని నిర్ణయించారు. భక్తులకు ఎక్కడా అసౌకర్యం కలగకుండా, గతేడాది తప్పిదాలు పునరావృతం కాకుండా చూడాలని చైర్మన్ రోహిత్ సూచించారు. సెక్యూరిటీ నిత్యం అప్రమత్తంగా ఉండాలని, భక్తులకు అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఇంజనీరింగ్ అధికారులు దృష్టి సారించాలన్నారు. సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని ఆయన సూచించారు.

ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలు



కాకినాడలో తనిఖీలు నిర్వహిస్తున్న అధికారులు

జీజీహెచ్(కాకినాడ) సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సాధారణ ప్రసవాలు, సీజేరియన్ ప్రసవాలు ఎన్ని జరుగుతున్నాయి, ఏ విధంగా జరుగుతున్నాయి అనే అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు శుక్రవారం కాకినాడలోని పలు ప్రైవేటు ఆసుపత్రుల్లో తనిఖీలతో కూడిన ఆడిట్ నిర్వహించారు. కోనసీమ జిల్లా డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.దుర్గారావు ఆధ్వర్యంలో కాకినాడలోని డాక్టర్ వీర్రాజు హాస్పటల్, భాను నర్సింగ్ హోం, సన్‌రైజ్ హాస్పటల్, టీమ్ హాస్పటల్, అమృత మదర్ అండ్ చైల్డ్ హాస్పటల్‌లలో ఆడిట్ నిర్వహించారు. ప్రైవేటు హాస్పటల్స్‌లో నిబంధనలకు విరుద్ధంగా సిజేరియన్ ప్రసవాలను ప్రోత్సహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సాధారణ ప్రసవాలను పెంచాల్సిన అవసరం చాలా ఉందని సూచించారు. తొలి కాన్పులో సాధారణ ప్రసవ చేయడం వల్ల కలిగే ప్రయోజనాలు ఏ విధంగా ఉంటాయో అనే విషయాలను ఆసుపత్రులకు వచ్చే గర్భిణులు, కుటుంబ సభ్యులకు తెలియజేయాలని ప్రైవేటు ఆసుపత్రుల నిర్వాహకులకు సూచించారు. అలాగే కాకినాడ డీఎంహెచ్‌వో డాక్టర్ జె.నరసింహనాయక్ బృందం కోనసీమ జిల్లాలో ఆడిట్ నిర్వహించింది. కాకినాడలో చేసిన ఆడిట్‌లో డీఐవో డాక్టర్ బివివి సత్యనారాయణ, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ భరత్‌లక్ష్మి, ఎస్‌వో కె.వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

అర్ధరాత్రి హత్య

- విడాకులు తీసుకుని కుమార్తె పెళ్లి కోసం కలిసిన జంట
- భర్తకు వేరే మహిళతో వివాహేతర సంబంధం
- రోజూ మద్యం మత్తులో వీడియో కాల్స్
- కోపంతో భర్త తలపై ఇనుపరాడ్‌తో బలంగా కొట్టి చంపిన భార్య

వివాహమై ఆడబిడ్డ పుట్టిన తరువాత భార్యాభర్తలిద్దరికీ పొసగలేదు. దాంతో విడాకులు తీసుకుని విడిపోయారు. కానీ కుమార్తె పెళ్లిలో కన్యాదానం కోసం పెద్దల మాట విని మళ్లీ కలుసుకున్నారు. అయితే భర్త రోజు రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని వేరే మహిళకు వీడియో కాల్ చేసి మాట్లాడుతున్నాడనే కోపంతో అర్ధరాత్రి కిరాతకంగా కొట్టి చంపింది భార్య. ఈ సంఘటన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా నడిపూడిలో జరిగింది.

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం నడిపూడి గ్రామం బైపాస్ రోడ్డులో మెట్ల రాంజీ కాలనీలో డాక్టర్ బాబూజగ్జీవన్‌రామ్ కల్యాణ మండపం సమీపంలో దొమ్మేటి రాంబాబు (61), భార్య వెంకటరమణతో సొంతింట్లో జీవించేవాడు. రాంబాబు కాకినాడ హెడ్ క్వార్టర్ స్క్వాడ్‌లో ఆర్టీసీ బస్సుల తనిఖీ అధికారిగా పనిచేస్తున్నాడు. రాంబాబు, వెంకటరమణ కాపురం కొంతకాలం సజావుగానే సాగింది. వారికి కుమార్తె హేమ జన్మించింది. భార్యాభర్తల మధ్య విభేదాలు రావడంతో విడాకులు తీసుకుని విడిపోయారు. హేమ తండ్రి వద్దనే ఉంది. విడిపోయిన భార్య వెంకటరమణ ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశానికి వెళ్లి కొంతకాలం పనిచేసుకుని తిరిగి స్వదేశానికి చేరుకుంది. కాలక్రమంలో కుమార్తె హేమకు పెళ్లి చేయాలని పెద్దలు నిర్ణయించారు. దాంతో విడిపోయిన భార్యభర్తలు కలిసి కన్యాదానం చేయించాల్సిన పరిస్థితిపై రాంబాబు కుటుంబసభ్యులు చర్చించుకున్నారు. దాంతో పెద్దల సమక్షంలో కలిసి కుమార్తె వివాహాన్ని జరిపించారు. కుమార్తె నరాల హేమ కుటుంబం ప్రస్తుతం చెన్నైలో జీవిస్తున్నారు.

ఒకే ఇంట్లో ఉన్నా కానీ...

ఈ నేపథ్యంలో విడిపోయిన భార్యాభర్తలు తిరిగి కలుసుకున్నప్పటికీ ఒకే ఇంట్లో దూరంగా ఉంటున్నారు. రాంబాబు భోజనాన్ని కూడా బయట నుంచి తెచ్చుకుని తినేవాడు. అతడు గత కొంతకాలంగా మరో మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. రోజు రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకుని వేరే మహిళకు వీడియో కాల్ చేసి మాట్లాడుతున్న తీరుపై వెంకటరమణ కక్ష పెంచుకుంది. గురువారం రాత్రి మద్యం మత్తులో ఇంటికి చేరుకున్న రాంబాబు 12 గంటల వరకు ఫోన్‌లో మాట్లాడినట్టు చెప్తున్నారు. ఆ తరువాత మద్యం మత్తులో మంచంపై పడి ఉన్న రాంబాబును భార్య వెంకటరమణ ఇనుపరాడ్‌తో తలపై బలంగా మోదడంతో చనిపోయాడు. శుక్రవారం ఉదయం బంధువులకు ఫోన్ చేసి గుండెపోటుతో రాంబాబు మృతి చెందినట్టు భార్య సమాచారం ఇచ్చింది. నడిపూడి చేరుకున్న బంధువులు మృతదేహం పడి ఉన్నతీరు, మంచం నిండా రక్తం మరకలు గుర్తించి వెంటనే తాలూకా పోలీసులకు సమాచారం అందించారు. తాలూకా సీఐ డి.ప్రశాంత్‌కుమార్, ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు సిబ్బందితో కలిసి శుక్రవారం సంఘటనా స్థలానికి చేరుకున్నారు. పోలీసుల ప్రాథమిక దర్యాప్తులో భార్య వెంకటరమణ తలపై ఇనుపరాడ్‌తో బలంగా మోదడం వల్లే రాంబాబు మృతిచెందినట్టు గుర్తించారు. రావులపాలేనికి చెందిన మృతుడికి కుమారుడు వరుసైన దొమ్మేటి నాగసురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. అయితే ఇది ఒక్కరి పనేనా అన్న కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేపట్టారు. క్లూస్‌టీమ్, డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరిస్తున్నారు. మృతదేహాన్ని శవపంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు తాలూకా ఎస్ఐ ప్రశాంత్‌కుమార్ తెలిపారు.



రాంబాబు మృతదేహం

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి రాజీలేని పోరాటం

ప్రభుత్వం తక్షణం పీఆర్సీ కమిటీని నియమించాలి

ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రామసూర్యనారాయణ



మాట్లాడుతున్న రామసూర్యనారాయణ

అమలాపురం రూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాజీలేని పోరాటం చేసేందుకు వెనుకాడబోనని ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాశీభట్ల రామసూర్యనారాయణ హామీ ఇచ్చారు. ప్రభుత్వం తక్షణం పీఆర్సీ కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు మధ్యంతర భృతిని చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులకు బకాయి పడ్డ డీఏలు, ఎరెండ్ లీవ్స్ బకాయిలు విడుదల చేయాలన్నారు. జిల్లాశాఖ అధ్యక్షుడు మద్దాల బాపూజీ అధ్యక్షతన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం కొంకాపల్లి ఏవీఆర్ నగర్‌లోని జిల్లా పెన్షనర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం ఉద్యోగులారా.. రండి.. టీ తాగుతూ మాట్లాడుకుందాం కార్యక్రమాన్ని నిర్వహించగా రామసూర్యనారాయణ ముఖ్య అతిథిగా ప్రసంగించారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఉద్యోగులకు ఇవ్వాల్సిన బకాయిలు రూ.25వేల కోట్లకు చేరాయన్నారు. ప్రతీ నెల 1న ఉద్యోగులకు జీతాలు చెల్లించాలని గత ప్రభుత్వంలో గవర్నర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చినందుకు తప్పుడు కేసులు పెట్టి నాతో పాటు కుటుంబ సభ్యులను సైతం వేధించారని, చివరకు హత్య చేసేందుకు కూడా ప్రయత్నించారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించడానికి చొరవ తీసుకుని బకాయిలు ఎంతో ముందు లెక్క తేల్చాలన్నారు. వాటికి చట్టబద్ధత కల్పించే విధంగా చొరవ తీసుకోవాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి కె.మల్లిబాబు, కోశాధికారి జేపీ రాజ్‌కుమార్, ఉపాధ్యక్షుడు ఎం.విజయ్‌కుమార్, కొప్పిశెట్టి వెంకటగణేష్, సహ కార్యదర్శి పి.శివకుమార్, పెన్షనర్ల సంఘ నాయకుడు కేకేవీ నాయుడు, ఎస్టీఎస్ సీహెచ్ కృష్ణమూర్తి, పి.కామేశ్వరరావు, ఎం.శ్రీనివాస్, వి.సద్గుణరావు, ఎంవీవీఎస్ ప్రసాద్, కొమ్మల స్వామినాయుడు, శ్రీమన్నారాయణ, వర్మ, పాండురంగారావు తదితరులు ఉన్నారు. వీఆర్వోల సంఘ ప్రతినిధులు ఉద్యోగుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కె.రామసూర్యనారాయణను కలుసుకుని వినతిపత్రం అందజేశారు. అర్హులైన గ్రేడ్-1 వీఆర్వోలకు సీనియర్ అసిస్టెంట్లు, గ్రేడ్-2 వీఆర్వోలకు గ్రేడ్-1 వీఆర్వోలకు వన్‌టైమ్ సెటిల్‌మెంట్ కింద పదోన్నతులు కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. వీఆర్వోల సంఘ జిల్లా అధ్యక్షుడు సాధనాల యెల్లేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు బాపూజీ పాల్గొన్నారు.

చెట్టుకు ఉరేసుకున్న యువకుడు

ఎటపాక, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మానసిక స్థితి సరిగ్గా లేక ఆదివాసీ యువకుడు చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శుక్రవారం అల్లూరి జిల్లా ఎటపాక మండలం బాసవాగు గ్రామ సమీపంలో జాతీయ రహదారి పక్కన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... చత్తీస్‌గఢ్ రాష్ట్రం సుకుమా జిల్లాలోని పూసుపల్లి గ్రామానికి చెందిన కర్బామి జోగా (24) మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈనెల 1న స్వగ్రామంలో కుటుంబసభ్యులతో గొడవపడి ఈ ప్రాంతానికి వచ్చాడు. రెండురోజుల క్రితం రాంగో పాలపురం జాతీయ రహదారిపై ఒంటి పై దుస్తులు లేకుండా తిరిగాడని చెప్తున్నారు. ఈ క్రమంలో బాసవాగు సమీపంలో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సులభంగా డబ్బు సంపాదనకు దొంగతనాలు

- అంతర్‌రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్
- రూ.11,58,500 విలువైన ఆభరణాలు, రూ.2.80 లక్షల నగదు స్వాధీనం



రాజోలులో వివరాలు వెల్లడిస్తున్న రాజోలు సీఐ నరేష్‌కుమార్

రాజోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): అంతర్‌రాష్ట్ర దొంగల ముఠాను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.11,58,500 విలువచేసే 64 గ్రాముల బంగారం, 2కిలోల 859 గ్రాముల వెండి, రూ.2లక్షల 80వేల నగదును స్వాధీనం చేసుకున్నామని రాజోలు సీఐ టీవీ నరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్ తెలిపారు. రాజోలు పోలీసుస్టేషన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో వారు నిందితుల వివరాలు వెల్లడించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాజోలు మండలం బి.సావరానికి చెందిన కె.అర్జున్ డిగ్రీ వరకు చదివి ఇంటి వద్ద ఖాళీగా ఉంటున్నాడు. మద్యానికి అలవాటు పడి సరైన సంపాదన లేక సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు ప్రారంభించాడు. అర్జున్‌పై కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లాలో పదికి పైగా దొంతనాల కేసులు ఉన్నాయి. ఏలూరు జిల్లా బుట్టాయిగూడెం మండలం గొల్లగూడెనికి చెందిన ఎస్.మంగప్రసాద్ వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన షేక్ బాషీ వెండి పట్టీలు తయారుచేస్తూ ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. అతడిపై మారేడుమిల్లి పోలీసుస్టేషన్‌లో గంజాయి రవాణా చేసినందుకు కేసు నమోదైంది. కాకినాడకు చెందిన షేక్ అజీజ్ ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేసేవాడు. అయితే ఈ నలుగురు మద్యం, విలాసాలకు అలవాటు పడి వచ్చే ఆదాయం సరిపోక సులభంగా డబ్బు సంపాదించాలని దొంగతనాలు చేశారు. ఈ నలుగురిని రాజోలు పోలీసులు శుక్రవారం అరెస్ట్ చేశారు. కోనసీమ జిల్లా ఎస్పీ బీవీ కృష్ణారావు ఆదేశాల మేరకు కొత్తపేట డీఎస్పీ ఎస్.మురళీమోహన్ ఆధ్వర్యంలో రాజోలు సీఐ టీవీనరేష్‌కుమార్, అమలాపురం క్రైమ్ సీఐ ఎం.గజేంద్రకుమార్, సిబ్బంది, రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్, సిబ్బంది నిందితులను పట్టుకున్నారు. ముగ్గురిని రాజోలు మ ండలం బి.సావరంలో, ఒకరిని కాకినాడలో అరెస్టు చేశామని తెలిపారు. నిందితులకు రాజమహేంద్రవరం సెంట్రల్ జైల్లో పరిచయడం ఏర్పడిందని, తర్వాత ముఠాగా ఏర్పడి దొంగతనాలకు పాల్పడ్డారని తెలిపారు. నిందితులను రాజోలు కోర్టులో హాజరుపరుచగా రిమాండ్‌కు తరలించినట్టు తెలిపారు. నిందితులను పట్టుకున్న సీఐ నరేష్‌కుమార్, క్రైమ్ ఎస్‌ఐ గజేంద్రకుమార్, ఎస్‌ఐ పరదేశీ, ఏఎస్‌ఐ బాలకృష్ణ, ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్, క్రైమ్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

చిట్టీల వ్యాపారి రూ.40 కోట్లకు కుచ్చుటోపీ

కుటుంబంతో సహా పరారీ, కేసు నమోదు



వీరశంకరరావు కుటుంబం

ఐ.పోలవరం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఐ.పోలవరం మండలం మురమళ్లలో చిట్టీల వ్యాపారి సుమారు రూ.40కోట్లకు ఎగనామం పెట్టి పరారయ్యాడు. బాధితులు పోలీసులను ఆశ్రయించారు. ఐ.పోలవరం మండలంలోని పశువుల్లంక గ్రామానికి చెందిన చింతలపూడి వీరశంకరరావు గత కొన్నేళ్లుగా మురమళ్ళ, ముమ్మిడివరం, కాకినాడ తదితర ప్రాంతాల్లో చిట్టీల పేరుతో వ్యాపార లావాదేవీలు నిర్వహించేవాడు. అయితే సభ్యులకు సొమ్ము చెల్లించకుండా సుమారు రూ.40కోట్లకు ఎగనామం పెట్టి కుటుంబంతో సహా పరారైనట్టు బాధితులు ఐ.పోలవరం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరశంకర్రావు లక్ష నుంచి రూ.కోటి వరకు చిట్టీలు నిర్వహించేవాడు. గత కొన్ని రోజుల క్రితం కుటుంబంతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోవడంతో బాధితులు లబోదిబోమంటున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ ఎం.రవీంద్రబాబు తెలిపారు. శుక్రవారం బాధితులు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబును కలిసి తమకు జరిగిన మోసంపై మొరపెట్టుకున్నారు.

రైలు ఢీకొని యువకుడి మృతి

మండపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడి రైల్వే స్టేషన్‌లో గురువారం రాత్రి 11 గంటల సమయంలో రైలు ఢీకొని యువకుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ద్వారపూడి పంచాయతీ పరిధిలోగల వేములపల్ల బంగారమ్మ కాలనీకి చెందిన మానేపల్లి లక్ష్మణ్ (16) గురువారం రాత్రి 11గంటల సమయంలో రైలు ఢీకొని మరణించాడు. శుక్రవారం లక్ష్మణ్ మృతదేహాన్ని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. సంఘటనపై రాజమహేంద్రవరం రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ దొంగల ముఠా అరెస్ట్

12 వాహనాల స్వాధీనం



బైక్ దొంగలను పట్టుకున్న కోరుకొండ పోలీసులు

కోరుకొండ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కొంతకాలంగా ఇంటి ముందు పార్కు చేసిన బైక్‌లను పట్టుకుపోతున్న దొంగల ముఠాను కోరుకొండ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. వారి నుంచి 11 స్కూటీలు, ఒక స్ప్లెండర్ బైక్ స్వాధీనం చేసుకున్నారు. దీనికి సంబంధించి తూర్పుగోదావరి జిల్లా కోరుకొండ మండలం గాదరాడ గ్రామానికి చెందిన ముగ్గురిని అరెస్ట్ చేశారు. ఈ మేరకు శుక్రవారం కోరుకొండ పోలీస్‌స్టేషన్ వద్ద నార్త్‌జోన్ డీఎస్పీ వై.శ్రీకాంత్ వివరాలను మీడియాకు వెల్లడించారు. గాదరాడకి చెందిన అల్లాడి విజయ్‌కుమార్ పాత నేరస్తుడు. ప్రస్తుతం బెయిల్‌పై ఉన్నాడు. మద్యం, జూదానికి బానిసై బైక్‌లు దొంగతనాలు చేస్తున్నాడు. కోరుకొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 బైక్‌లు, రాజమహేంద్రవరం త్రీటౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలో 4 బైక్‌లు, వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, రాజానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, బొమ్మూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, సీతానగరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1, ప్రకాష్ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో రెండు వెరసి 12 బైక్‌లు దొంగిలించాడు. విజయ్‌కుమార్, వనుం సురేష్, వనుం లోవరాజు బైక్ దొంగతనాల్లో భాగస్తులు. సీఐ వై.సత్యకిషోర్‌కు వచ్చిన సమాచారం మేరకు ఈ ముగ్గురిని శుక్రవారం ఎస్‌ఐ నాగార్జున, సిబ్బంది గాదరాడ గ్రామ శివారులో అదుపులోకి తీసుకుని బైక్‌లు స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. కేసులో ప్రతిభ కనబరిచిన ఎస్‌ఐ నాగార్జున, హెచ్‌సీ శ్రీను, కానిస్టేబుల్స్ పవన్ వరప్రసాద్, బాపినాయుడులను అభినందించారు.

చోరీ కేసులో ఇద్దరి అరెస్ట్

బాధిత మహిళకు బంగారు ఆభరణాల అందజేత



మహిళకు బంగారు ఆభరణాలను అందజేస్తున్న పిఠాపురం సీఐ శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్

పిఠాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చోరీ కేసులో ఇద్దరిని అరెస్ట్ చేసి రికవరీ చేసిన బంగారు ఆభరణాలను బాధిత మహిళకు పిఠాపురం పోలీసులు శుక్రవారం అందజేశారు. కాకినాడ జిల్లా పిఠాపురం కుంతీమాధవస్వామి గుడి వీధిలో నివాసముంటున్న ఆశా కార్యకర్త కృష్ణవేణికి చెందిన బంగారు ఆభరణాలు గతేడాది సెప్టెంబరులో చోరీ అయ్యాయి. రూ.5లక్షలు విలువైన బంగారు నగలు చోరీపై పిఠాపురం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆధునిక సాంకేతిక పద్ధతులు అనుసరించి హైదరాబాద్‌కు చెందిన సోమరాజు, సుమంత్ ఈ చోరీకి పాల్పడినట్టు గుర్తించారు. వారిని విచారించగా హైదరాబాద్‌లోని ఓ బస్టాండులో బ్యాగు, అందులో ఉంచిన బంగారు ఆభరణాలను చోరీ చేసినట్టు తెలిపారు. వారి వద్ద ఉన్న 4 బంగారు గాజులు, చైను, పుస్తెల తాడు, 2 ఉంగరాలు వెరసి 80 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు. అనంతరం కోర్టు అనుమతితో బాధితురాలికి శుక్రవారం సదరు ఆభరణాలను పిఠాపురం సీఐ జి.శ్రీనివాస్, ఎస్ఐ మణికుమార్ అందజేశారు. తన ఆభరణాలను తిరిగి అప్పగించిన సీఐ, ఎస్ఐను కృష్ణవేణి, ఆమె కుటుంబసభ్యులు ఘనంగా సత్కరించారు.

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

'అంబేద్కర్ అందరివాడు' జాతీయ మహాసభ కరపత్రం ఆవిష్కరణ

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 'అంబేద్కర్ అందరివాడు' ప్రపంచ ప్రచారకర్త బొర్రా విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నవరలో నవంబరు 26న జరగనున్న జాతీయ మహాసభకు సంబంధించి మొదటి కరపత్రాన్ని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ శుక్రవారం ఆవిష్కరించారు. కాశి లక్ష్మణస్వామి, పీడీపీఎస్ రాజు, పోలినాటి ఎజ్రాశాస్త్రి, బొర్రా అర్జునుడు, బొండాడ జయబాబు, సభ కన్వీనర్ బొర్రా ప్రీతం అంబేద్కర్, పృథ్వీతేజ తదితరులు పాల్గొన్నారు.



తాళ్లరేవులో గురువులను సత్కరిస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు



సామర్లకోట మండలం కొప్పవరంలో ఎంపీ సతీష్ క్యాంపు కార్యాలయంలో గురువులకు సన్మానం



కాకినాడలో ఉపాధ్యాయ దినోత్సవ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పద్మశ్రీ

వైభవంగా గురుపూజోత్సవం

ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులకు సత్కారం

కాకినాడ సిటీ, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఒమ్మి రఘురామ్ ఆధ్వర్యంలో శ్రీరామకృష్ణ సేవా సమితికి చెందిన వివేకానంద ఆడిటోరియంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. విద్యార్థులకు భారత రాజ్యాంగంపై వ్యాసరచన పోటీలు నిర్వహించి బహుమతులు, ప్రశంసాపత్రాలు అందజేశారు. సన్మానగ్రహీతలైన... రంగరాయ వైద్య కళాశాల ప్రొఫెసర్ ఎం.వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులు అద్దంకి వెంకన్నబాబు, వనజాక్షి విక్టర్, సీహెచ్ వేణు, ఎల్.శ్రీదేవి, ఏవీ శ్రీనివాస్, వాసంశెట్టి కామేశ్వరరావు, తేజ, ఎంజీ వర్మ, ఉమామహేశ్వరరావు, మీనాక్షి ప్రసంగించారు. శ్రీరామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు వీఎల్ గాంధీ, కార్యదర్శి కె.సతీష్, ఉపాధ్యక్షుడు వక్కలంక రామకృష్ణ, ఐక్య వేదిక రాష్ట్ర కోర్ కమిటీ సభ్యులు ప్రెసింగి ఆదినారాయణ, పప్పు దుర్గా రమేష్, డేగల రమేష్, పిల్లారిశెట్టి రాజేశ్వరి, సురేష్‌నాయుడు, మన్యం సుభద్ర, కె.రజనీగౌరి, ఐక్య వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి సుందరపల్లి గోపాలకృష్ణ, జేవీవీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ కొమ్మన తాతారావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): నగరంలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డు ఎంప్లాయీస్ అసోసియేషన్ భవనంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శాస్త్రి, జిల్లా అధ్యక్షుడు పద్మనాభం ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పిఠాపురం విశ్వ విజ్ఞాన ఆధ్యాత్మిక పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. వి.పాండురంగవిఠల్, ఐ.సత్యనారాయణ, జి.రామకృష్ణ, పీవీ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవు లయన్స్ క్లబ్ హాలులో లయన్స్ అధ్యక్షుడు పొన్నాడ పేరయ్యరాజు అధ్యక్షతన టీచర్లు కన్నీడి నాగమణి, భూపతి సుమశ్రీ, కన్నేపల్లి అప్పలనాగేంద్రశర్మ, ఫయాజ్ సయ్యద్, మందపల్లి సూర్యప్రకాష్, వేగేశ్న వెంకటేశ్వరరాజు, ఎస్వీ రమణకుమార్‌లను ఘనంగా సన్మానించారు. లయన్స్ క్లబ్ ప్రతినిధులు నరేంద్రకుమార్, బిల్లకుర్తి శ్రీనివాసరెడ్డి, ఏలూరి సూర్యనారాయణ, నున్న దత్తు, సామా ధూళిపూడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

కరప (ఆంధ్రజ్యోతి): వేళంగి ఎయిమ్ కిడ్జ్ స్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి ఉపాధ్యాయులకు శుభాకాంక్షలు తెలిపారు. ఎయిమ్ సేవా సంస్థల అధినేత ఎస్‌ఏ గాడ్విన్ సమకూర్చిన నూతన వస్త్రాలు, బహుమతులను ఉపాధ్యాయులు, సిబ్బందికి, సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలైన విద్యార్థులకు అందజేశారు. కార్యక్రమంలో ఎయిమ్ సేవా సంస్థల కో-ఆర్డినేటర్ మేడపాటి రాజ్‌కుమార్, ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి పలివెల రమేష్, ప్రధానోపాధ్యాయురాలు పి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): కొప్పవరంలోని రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కార్యాలయంలో క్యాంపు ఇన్‌చార్జి మేకా లక్ష్మణమూర్తి ఆధ్వర్యంలో విశ్రాంత ఉపాధ్యాయులు పెంకే వెంకటరమణ (కోలంక), ఎస్.వీరరాఘవరావు (కుమారప్రియం)లను ఘనంగా సత్కరించారు. అరిగెల శ్రీనివాసరావు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, తలాటం హరీష్, ఆనంద్ న్యూటన్, పీపీ గౌరీశంకర్, ముత్యాల అనిల్, బండి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు. బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విద్యాలయం భవనంలో ఘనంగా హెచ్‌ఎంలు తోటకూర సాయిరామకృష్ణ, యు.సత్యనారాయణ, ఉపాధ్యాయుడు వై.నారాయణరావులను బ్రహ్మకుమారీలు బీకే రజని, బీకే లక్ష్మి ఘనంగా సన్మానించారు. విశ్రాంత వ్యాయామోపాధ్యాయుడు తాళ్ళూరి వైకుంఠం పాల్గొన్నారు.

గొల్లప్రోలు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మాధురి విద్యాలయలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి అధినేత కదారి తమ్మయ్యనాయుడు-సీతాదేవి దంపతులు, ఉపాధ్యాయులు, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నాయుడు దంపతులను ఉపాధ్యాయులు సత్కరించారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): కుతుకుడుమిల్లికి చెందిన ఇద్దరు సీనియర్ విశ్రాంత ప్రధానోపాధ్యాయులను బీజేపీ కొత్తపల్లి మండల శాఖ అధ్యక్షుడు పంపన శేషగిరి ఆధ్వర్యంలో ఆ పార్టీ నేతలు సత్కరించారు. మచ్చికంటి వెంకట చలపతిరావు, పడగా నరసింహారావులకు దుశ్శాలువాలు కప్పారు. నాయకులు రవణం సుబ్రహ్మణ్యం, మేడసాని వరలక్ష్మీనారాయణ, డీవీఎస్ రాజు, గౌరి పాల్గొన్నారు.

సర్పవరం జంక్షన్ (ఆంధ్రజ్యోతి): రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్టు అధ్యక్షుడు రత్నప్రసాదరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం నిర్వహించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి ఆయనతో పాటు డాక్టర్ అడ్డాల సత్యనారాయణ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు కాశిన త్రినాథ ప్రసాదరావు, కమ్మిల సత్యనారాయణమూర్తి, పిల్లా భీమశంకరం, జి.మోహర్ గంగాధర్, నిమ్మకాయల వెంకటేశ్వరరావులను ఘనంగా సత్కరించారు. పి.ధర్మచంద్రరాజు, ఓంనమశ్శివాయ, కృష్ణమోహన్ పాల్గొన్నారు.



కాకినాడ సిటీ: ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్య వేదిక ఆధ్వర్యంలో వివేకానంద ఆడిటోరియంలో సన్మానించిన దృశ్యం



కరప మండలం వేళంగి ఎయిమ్ కిడ్స్ స్కూలులో కేక్ కట్ చేస్తున్న దృశ్యం



కొత్తపల్లిలో సీనియర్ విశ్రాంత ఉపాధ్యాయులను సత్కరిస్తున్న బీజేపీ నాయకులు



గొల్లప్రోలు మాధురి విద్యాలయంలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం



కాకినాడ రూరల్ మండలం రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో ఉపాధ్యాయులకు సత్కారం

జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు వీరే...



అనిశెట్టి సీతారామరాజు

గొల్లప్రోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పాఠశాల రూపురేఖలు మార్చిన గొల్లప్రోలు సూరంపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు అనిశెట్టి సీతారామరాజు జిల్లాస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఆయన్ను కలెక్టర్ సగిలి షాన్‌మోహన్, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ, ఎమ్మెల్యేలు వనమాడి కొండబాబు, వరుపుల సత్యప్రభ, డీఈవో పిల్లి రమేష్ సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి చేసిన కృషిని అభినందించారు.



పట్టా సూర్యప్రసాద్

కరప, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వేళంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోషల్ ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న పట్టా సూర్యప్రసాద్ జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యే కొండబాబు, ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖర్, కర్రి పద్మ సమక్షంలో అందుకున్నారు. ఇదే పాఠశాలలో పీడీలుగా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు, జి.వేణుగోపాలరావు కాకినాడ, కోనసీమ జిల్లాల్లో బెస్ట్ స్పోర్ట్స్ ఎక్సలెన్స్ అవార్డులు అందుకున్నారు. ఈ ముగ్గురినీ హెచ్‌ఎం ఆర్.త్రిమూర్తులు, సర్పంచ్ సవిలే నీలిమారాజేష్, పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులు మెర్ల వీరయ్యచౌదరి, డాక్టర్ బొండా వెంకన్నరావు తదితరులు అభినందించారు.

దాకే అప్పలరాజు



కొత్తపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉప్పాడ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న వాకతిప్పకు చెందిన దాకే అప్పలరాజు కలెక్టర్ షాన్‌మోహన్ నుంచి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. మాస్టారిని హెచ్‌ఎం ఎస్‌ఎల్‌వీఎన్ శాస్త్రి, పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు అభినందించారు.

మహాన్నదానాలు

సామర్లకోట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్టేషన్ సెంటర్లో ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మహాన్నదానాన్ని ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప తనయుడు రంగనాగ్, గోలి కోటేశ్వరరావు స్వయంగా వడ్డించి ప్రారంభించారు. సుమారు 5వేల మంది అన్నప్రసాదం స్వీకరించారు. టీడీపీ నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, బలుసు శ్రీనివాసు, అందుగుల జార్జిచక్రవర్తి, గొలితి సత్యనారాయణ, బొందల రామలక్ష్మీశ్రీనివాసు, రెడ్డి, వల్లూరి దొరబాబు, కంచర్ల మధు, మలిరెడ్డి ప్రసాద్, కాళ్ళ రవీంద్ర పాల్గొన్నారు. లయన్స్ భీమేశ్వరా క్లబ్ ఆవరణలో క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ అమలకంటి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మహాన్నదానం నిర్వహించగా రెండు వేల మంది హాజరయ్యారు. క్లబ్ ప్రతినిధులు చిత్తులూరి రాజా, కృష్ణమోహన్, గుండు శంకరరావు, మార్త్రల విజయభాస్కరరెడ్డి, సేపేని సురేష్, మేకా శ్రీనివాసు, కూనంశెట్టి అర్జునరావు సేవలందించారు.

'ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలి'

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగ విరుద్ధమైన ఎస్సీ వర్గీకరణను నిలిపివేయాలని, గత ప్రభుత్వం రద్దు చేసిన 27 రకాల దళిత సంక్షేమ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ పీవీ రావు మాలమహానాడు ప్రధాన నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబుకి బహిరంగ లేఖ విడుదల చేశారు. కాకినాడలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో జాతీయ అధ్యక్షుడు పండు అశోక్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మూలే మేఘరాజు మాట్లాడగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, కోనసీమ జిల్లా అధ్యక్షుడు జల్లి శ్రీనివాసరావు, సభ్యులు పాల్గొన్నారు.





కాకినాడ పెద్ద మసీదులో కేక్ కట్ చేస్తున్న ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్, మెయిన్‌రోడ్డులో ముస్లింలతో కలిసి ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే కొండబాబు

భక్తి శ్రద్ధలతో మిలాద్ ఉన్ నబీ

కార్పొరేషన్ (కాకినాడ), సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధి చెందిన జామియా మస్జీద్ (పెద్ద మసీదు) అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్ తెలిపారు. మిలాద్-ఉన్-నబీ వేడుకల్లో భాగంగా శుక్రవారం ఆయన మసీదుకు విచ్చేశారు. మహమ్మద్ ప్రవక్త 1500 జయంతి సందర్భంగా ముస్లిం మత పెద్దల సమక్షంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. మసీదు కమిటీ అధ్యక్షుడు ఎజాజుద్దీన్, ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ అఫిలియేటెడ్ కాలేజీ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎండీ హబీబ్ బాషా, ఇమామ్ అబ్దుల్ రజాక్ రిజ్వీ, కమిటీ సభ్యులు జుబేర్, సలీమ్, రబానీ, అజీజ్, జిలానీ, రహీం తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త జన్మదినాన్ని పురస్కరించుకుని నగరంలోని ముస్లింలు శుక్రవారం మిలాద్ ఉన్ నబీ వేడుకలు నిర్వహించారు. జె.రామారావుపేట సెంటరు వద్ద పెద్ద సంఖ్యలో ముస్లింలతో ప్రారంభమైన ర్యాలీ సినిమారోడ్, మెయిన్‌రోడ్ మీదుగా సాగింది. ఎమ్మెల్యే కొండబాబు ముస్లింలకు మిలాద్-ఉన్-నబీ శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. మల్లిపూడి వీరు, ముస్లిం నాయకులు ఎంఏ తాజుద్దీన్, ఎండీ ఖాన్, ఎస్కే రహీమ్, ఎండీ అన్సర్, ఎంఏ సయ్యద్, ఆశిఫ్ ఆలీ, సయ్యద్ ఆలీ, అన్వర్, మొహిద్దీన్, కస్మార్, ఫైసల్, జారు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): మిలాద్-ఉన్-నబీ సందర్భంగా పట్టణ వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. పేదలకు పండ్లు, రొట్టెలు పంపిణీ చేశారు. అనంతరం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిపారు.

దసరా ఉత్సవాలకు రాట ముహూర్తాలు

కార్పొరేషన్ (కాకినాడ)/కార్పొరేషన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సూర్యారావుపేటలో రామలింగేశ్వరస్వామి సమేత శ్రీబాలాత్రిపుర సుందరి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు గ్రంధి బాబ్జీ, ఈవో వుండవిల్లి వీర్రాజు చౌదరి, ఎమ్మెల్యే తనయుడు, టీడీపీ ప్రొఫెసనల్ వింగ్ జిల్లా ఛైర్మన్ వనమాడి మోహనవర్మ శుక్రవారం రాట ముహూర్తం గావించారు. ఛైర్మన్, ఈవో మాట్లాడుతూ ఈనెల 22 నుంచి అమ్మవారి ఆలయంలో దసరా ఉత్సవాలు జరుగుతాయని, కూపన్ల సిస్టం లేదని, భక్తులకు సమాన దర్శనం ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు నెక్కంటి శ్రీనివాస్, సీకోటి అప్పలకొండ, చిట్టిపెద్ది రాంకుమార్, సుందరపల్లి సత్తిబాబు, తంగెళ్ల రాంబాబు, తుమ్మల సునీత, నల్లూరి తులసి, చెక్కా సుమిత్ర, చొల్లంగి ఉమాశ్రీదేవి, బిరుదా వీర ప్రభావతి, కాకినాడ మార్కెట్ కమిటీ ఛైర్మన్ బచ్చు శేఖర్, శివాలయం ఛైర్మన్ పల్లా సురేష్, నాయకులు పంతం నెహ్రూ, నేమాని సత్యనారాయణ, నల్లూరి శ్రీనివాస్, గంజి గోపి, చొల్లంగి వీరబాబు, ప్రధాన అర్చకులు సన్నిధిరాజు సుబ్రహ్మణ్యం, విజయకుమార్ పాల్గొన్నారు.

కార్పొరేషన్ (కాకినాడ) (ఆంధ్రజ్యోతి): ఈ నెల 22 నుంచి ప్రారంభమయ్యే శ్రీదేవీ నవరాత్రుల సందర్భంగా రాజేంద్రనగర్‌లోని కనకదుర్గ ఆలయంలో శుక్రవారం రాట ముహూర్తం చేశారు. ఆలయ కమిటీ ప్రతినిధి చంద్రశేఖర్ మాట్లాడుతూ నవరాత్రుల్లో కనకదుర్గాదేవికి భక్తుల సహకారంతో చేయించిన వెండి చీర అలంకారంతో పాటు ముత్తయిదువులతో కుంకుమ పూజలు చేయించి ప్రసాద వితరణ, నిత్యాన్నదానం నిర్వహిస్తామన్నారు. నిత్య పూజలకు దేవాలయ అర్చకుడు సాయికృష్ణని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో చింతపల్లి చంద్రశేఖర్, కాకర్లపల్లి శ్రీనివాస్, నాగప్రసాద్, కొమ్మూర్తి శ్రీనివాసరావు, రాజేష్, విశాలాక్షి, వీరబాబు, గుత్తుల శివస్వామి పాల్గొన్నారు.

సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా సత్యనారాయణ

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బుద్ధరాజు సత్యనారాయణను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం బోట్ క్లబ్ పార్కులో నిర్వహించిన అసోసియేషన్ సర్వసభ్య సమేశానికి రిటైర్డు డీఎంఈ డాక్టర్ ఎం.రాఘవేంద్రరావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ప్రధాన కార్యదర్శిగా అడబాల రత్నప్రసాదరావు, కోశాధికారిగా డీవీ సత్యనారాయణరాజు, కార్యనిర్వాహక కార్యదర్శిగా సీహెచ్‌వీ వెంకటరావు, న్యాయ సలహాదారుగా యనమల రామం, పలువురు డైరెక్టర్లు ఎన్నికయ్యారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వర్మ

ఉపాధ్యాయులకు గౌరవం కల్పించింది చంద్రబాబే

మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయులకు అన్ని విధాలా గౌరవం కల్పించింది ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడేనని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. ఇప్పుడు అదేబాటలో రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పయనిస్తూ విద్యారంగ అభివృద్ధికి, ఉపాధ్యాయుల సంక్షేమానికి కృషి చేస్తున్నారని చెప్పారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఆయన ఉపాధ్యాయులు, అధ్యాపకులకు శుభాకాంక్షలు తెలిపారు.

జనసేన బలోపేతానికి గ్రామస్థాయిలో కమిటీల ఏర్పాటు

కొత్తపల్లి, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జనసేన బలోపేతానికి గ్రామస్థాయిలో ఐదుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేసినట్టు కాకినాడ ఎంపీ తంగెళ్ళ ఉదయ్‌శ్రీనివాస్ చెప్పారు. మండలంలోని కొత్తపల్లిలో సురక్ష ప్యాలెస్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని 17 గ్రామాల జనసైనికులతో గురు, శుక్రవారాల్లో ఆత్మీయ సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ ఐదుగురికి స్థానిక ప్రజా సమస్యలపై పూర్తిస్థాయి అవగాహన పెంపొందించే చర్యలు చేపట్టామని ఎంపీ శ్రీనివాస్ చెప్పారు. కష్టపడి పనిచేసే కార్యకర్తలకు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో డిప్యూటీ సీఎం చర్యలు చేపడతారన్నారు. కొత్త, పాత నాయకులను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్లేలా కార్యకర్తలకు అవగాహన కల్పించామన్నారు. సురక్ష ప్యాలెస్ అధినేత, జనసైనికుడు డాక్టర్ జ్యోతుల శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పిఠాపురం ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్, తుమ్మల బాబు, తెలగంశెట్టి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్



సూర్యారావుపేట బీచ్‌లో నిమజ్జన ఏర్పాట్లను పరిశీలిస్తున్న వెంకటేశ్వరరావు, మాలకొండయ్య

గణనాథుల నిమజ్జనానికి భారీ ఏర్పాట్లు

సర్పవరం జంక్షన్, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 6,7 తేదీల్లో కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో వినాయక విగ్రహాలను నిమజ్జనం చేసే ప్రదేశంలో ఏర్పాట్లను గణేశ ఉత్సవ సమితి నగర ప్రతినిధులు రంబాల వెంకటేశ్వరరావు, వై.మాలకొండయ్య, దూసర్లపూడి రమణరాజు పరిశీలించారు. ఈ ఏడాది సుమారు 1,200 విగ్రహాల్లో 500 భారీ విగ్రహాలు ఉన్నాయన్నారు. వాటిని భారీ క్రేన్లతో సముద్రంలో నిమజ్జనం చేసేందుకు 19 ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశామన్నారు. పర్యటనలో డి.సుబ్రహ్మణ్యం, రామకృష్ణ, పి.సత్యనారాయణ, కె.చలపతి, నండూరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు-తాటిపర్తి రోడ్డుకు మరమ్మతులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గొల్లప్రోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలు-తాటిపర్తి రోడ్డు అధ్వాన పరిస్థితిని వివరిస్తూ.... 'ఐదు నెలలకే గోతులు, పగుళ్లు' శీర్షికతో ఈ నెల 1వ తేదీన ఆంధ్రజ్యోతిలో కథనం ప్రచురితమైంది. దీనికి కలెక్టర్, పంచాయతీ రాజ్ ఇంజనీరింగ్ ఉన్నతాధికారులు స్పందించి తక్షణం మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. గోతులు, పగుళ్లు ఏర్పడిన ప్రాంతాల్లో రోడ్డును తొలగించి మరమ్మతులు చేపట్టారు. గోతులు పూడ్చడంతో పాటు పగుళ్లు ఏర్పడిన ప్రాంతాల్లోనూ రోడ్డును సరిచేశారు.



బల్లకట్టుకు పడిన గండి పూడ్చివేత

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

గొల్లప్రోలు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఏలేరు కాలువపై గొల్లప్రోలు వద్ద బల్లకట్టుకు పడిన గండిని ఇసుక బస్తాలతో తాత్కాలికంగా పూడ్చివేశారు. బల్లకట్టు వద్ద గతంలో పడిన ఇసుక బస్తాలతో రింగ్‌బండ్ నిర్మించి పూడ్చగా.... ఇటీవల కురిసిన భారీ వర్షాలకు ఏలేరు కాలువలో నీటి ఉధృతి అధికమై ఇసుక బస్తాలు కొట్టుకుపోయి మరలా గండిపడి నీరు వృథాగా పోతున్న విషయంపై 'ఆంధ్రజ్యోతి'లో కథనం వచ్చింది. దీనిపై ఇరిగేషన్ అధికారులు స్పందించి కొట్టుకుపోయిన ఇసుక బస్తాల స్థానంలో కొత్తవి వేయించి గండిని తాత్కాలికంగా పూడ్చే పనులు చేపట్టి శుక్రవారం పూర్తి చేశారు.

ఉత్తమ ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): వాకపల్లి ప్రజా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయురాలు బాలూరి స్వప్న శుక్రవారం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డును పొందారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ శాలువా కప్పి సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు వి.రాజబాబు, వై. అచ్చిరాజులు, యూటీఎఫ్ అధ్యక్షుడు కోడి శ్రీనివాస్, యూటీఎఫ్ నాయకులు ఎస్వీ సూర్యనారాయణ, పద్మావతి, మండల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

నరసాపురం మెటల్ క్వారీపై అధికారులు నిర్లక్ష్యం వీడాలి

● ఆదివాసీ సంక్షేమ పరిషత్

రంపచోడవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): రంపచోడవరం మండలంలోని నరసాపురం గ్రామంలో నిర్వహిస్తున్న రెండు మెటల్ క్వారీలతో పంట పొలాలకు నష్టం కలుగుందని, బాంబ్ బ్లాస్టింగ్‌చేయడం వలన ఇళ్లు ధ్వంసం అవుతున్నాయని బాధితులు పలుమార్లు జిల్లా కలెక్టర్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి, సబ్ కలెక్టర్, డైరెక్టర్ మైన్స్, జియాలజీలకు ఫిర్యాదు చేసిన ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను అన్నారు. శుక్రవారం నరసాపురంలో బాధిత గ్రామ ప్రజలు నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామంలో రెండు క్వారీలు అనుమతులు లేకుండా నిర్వహిస్తున్నారని, పీసా చట్టం ప్రకారం గ్రామాభివృద్ధికి చెందాల్సిన నిధులు దుర్వినియోగం అవుతున్నాయన్నారు. ఐటీడీఏ ఉన్నతాధికారులు క్వారీ నిర్వహణదారులకే కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. క్వారీపై ఐటీడీఏ అధికారులు విచారణకు ఆదేశించామని చెప్పడమే తప్పా క్షేత్రస్థాయిలో విచారణ జరగలేదని అన్నారు. నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న రెవెన్యూ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేకుంటే అధికారుల నిర్లక్ష్యంపై ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో న్యాయపోరాటం చేయడానికి సిద్దంగా ఉన్నామని హెచ్చరించారు. ఆదివాసీ సంక్షేమ పరిషత్ డివిజన్ కోఆర్డినేటర్ పీఠా ప్రసాద్, గ్రామస్తులు కోసు దేవి శ్రీదేవి, కోటం పండమ్మ, పొడియం అరుణకుమారి, సారపు దుర్గ భవాని, చోడి అనిల్‌కుమార్‌దొర, కోటం శివకుమార్‌దొర పాల్గొన్నారు.

త్వరలోనే ముంపు బాధలకు విముక్తి

కూనవరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఈ ప్రాంత ప్రజలకు త్వరలోనే వరద బాధల నుంచి విముక్తి కలుగుతుందని రంపచోడవరం ఎమ్మెల్యే శిరీష దేవి అన్నారు. శుక్రవారం ఆమె ఇటీవల గోదావరి వరదలకు ముంపుకు గురైన ప్రాంతాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ 2027కల్లా సీఎం చంద్రబాబు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయాలనే నిశ్చయంతో ఉన్నారన్నారు. అందులో భాగంగానే ఈ ప్రాంతంలో గుర్తించిన గ్రామాలకు త్వరలోనే పరిహారం అందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎస్ఐ లతాశ్రీ, టీడీపీ నాయకులు ఎడవల్లి భాస్కరరావు, గడ్డిపాటి ప్రసాద్, గడేసుల ప్రేమ్‌చంద్, గడేసుల రంజిత్‌కుమార్, బరపాటి ప్రకాశరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

సమస్యలపై ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న టీడీపీ నాయకులు

ఎటపాక, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వర రామచంద్రాపురం మండలంలో వరద ముంపు ప్రాంతాల్లో శుక్రవారం పర్యటకు వచ్చిన ఎమ్మెల్యే శిరీషదేవికి ఎటపాక టీడీపీ సీనియర్ నాయకులు కిలారి వెంకన్న, నలజాల శ్రీకాంత్ పలు సమస్యలపై వినతి పత్రంను అంధజేశారు. ఎటపాక మండలంలో పలు గ్రామాలు ఇటీవల వరద ముంపులో చిక్కుకున్నాయని వారందరినీ ఆదుకోవాలని కోరారు. ముంపునకు గురయ్యే గ్రామాలకు ఆర్అండ్‌అర్ ప్యాకేజీ పరిహారం అందజేయాలని కోరారు. గతంలో నోటిఫికేషన్ జారీచేసిన భూములకు నష్ట పరిహారం చెల్లించాలన్నారు. ఎమ్మెల్యేన కలిసిన వారిలో టీడీపీ నాయకులు పాటి చలపతి, బాచినేని శ్రీకాంత్, పుట్టి రమేష్‌ఉన్నారు.

'రహదారులు మెరుగుపరచండి'

చింతూరు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి):చింతూరు మండలంలోని పలు మారుమూల గ్రామాలకు రహదారి సౌకర్యంలేక ప్రజలు అవస్థలు పడుతున్న విషయం చింతూరు సొసైటీ అధ్యక్షుడు సరియం చిట్టిబాబు ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి దృష్టికి తీసుకెళ్లారు. శుక్రవారం ఎమ్మెల్యే వరరామచంద్రాపురం మండలంలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. చిట్టిబాబు రహదార్ల దుస్థితి వివరిస్తూ వినతి పత్రాన్ని శిరీషకు అంధజేశారు. మండల మాజీ టీడీపీ అధ్యక్షుడు ఇళ్ల చిన్నారెడ్డి, టీడీపీ నాయకులు ఆసిఫ్, శీలం తమ్మయ్యలు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పోలవరం నిర్వాసితులకు నిత్యావసర సరుకుల అందజేత

దేవీపట్నం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): ఎల్ఐసీ 69వ జీవిత భీమా వారోత్సవాలు సామాజిక సేవలో భాగంగా పోలవరం ప్రాజెక్టు నిర్వాసిత గ్రామాలైన దేవీపట్నం మండలం గానుగొలగొంది, మూలపాడులో వంద మంది నిర్వాసిత కుటుంబాలకు ఎల్ఐసీ రాజమండ్రి డివిజన్ ఎస్‌డిఎం సత్యనారాయణ సాహు, దేవీపట్నం సర్పంచ్ కుంజం రాజామణి చేతుల మీదుగా నిత్యావసర వస్తువులు అందించారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం



మోతుగూడెం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): వైరామవరం మండలం బొడ్డగండి పంచాయతీ డొంకరాయి గ్రామంలో జిల్లా పరిషత్ పాఠ శాల లో విద్యార్థుల ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొలుత డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి ప్రధానోపాధ్యాయుడు ప్రవీణ్ నాయక్ టీడీపీ ఎంపీటీసీ కరకావెంకటరమణ పూలమాలలు వేసి నివాళుల ర్పించారు. డొంకరాయి ఎంపీటీసీ కరకా వెంకటరమణ ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థినీ, విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.

అడ్డతీగల,(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని అడ్డతీగల గాంధీ సెంటర్‌లో కాంగ్రెస్ నాయకులు దంగేటి ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గురువులను విద్యార్థులు సత్కరించారు..

మదర్ థెరిస్సా వర్ధంతి

మండల కేంద్రమైన అడ్డతీగల ఆర్టీసీ కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న మదర్ థెరిస్సా విగ్రహం వద్ద సేవా సంఘం కమిటీ ఆర్గనైజర్ చోడిశెట్టి. సుబ్బారావు ఆధ్వర్యంలో 28వ వర్ధంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంగేటి. సత్తిబాబు, తెలుగుదేశం నాయకులు బీరా బాలయేగి, యువజన నాయకులు పైడయ్య దొర, చెల్లందాస్ పాల్గొన్నారు.

జబర్దస్త్ యాక్టర్ సన్నీ ఏజెన్సీలో సందడి



మోతుగూడెం, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): చింతూరు మండలం మోతుగూడెంలో శుక్రవారం జబర్దస్త్ యాక్టర్ సన్నీ మోతుగూడెం మార్కెట్ సెంటర్‌లో టీ స్టాల్ దగ్గర హల్‌చల్ చేశారు. దీన్ని గమనించిన వెళ్లిన ప్రజలు, చిన్నారులు సన్నీతో సెల్ఫీలు దిగారు. అనంతరం జబర్దస్త్ సన్నీని ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఏజెన్సీలో నాలుగు రోజులపాటు వెబ్ సిరీస్ షూటింగ్ ఉంది అందువలన ఏజెన్సీలో పర్యటించానని తెలియజేశారు

విద్యుత్ లైన్ల పేరుతో భారీ వృక్షాల నరికివేత

ఎటపాక, సెప్టెంబరు5 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ లైన్ల ఏర్పాట్ల పేరుతో విద్యుత్‌శాఖ అధికారులు అత్యుత్సాహంతో వందల సంవత్సరాల కలిగిన భారీ వృక్షాలను నరికివేశారు. లోతట్టు ప్రాంతాల గ్రామాల్లో గోదావరి వరదల సమయంలో విద్యుత్ అంతరాయం లేకుండా ఉండేందుకుగాను విద్యుత్‌శాఖ అధికారులు ఇటీవల భద్రాచలం-కూనవరం రోడ్ పక్కన వెంబడి తోటపల్లి గ్రామం నుంచి మురుమూరు గ్రామం వరకు 11కేవీ విద్యుత్ లైన్ కోసం పొడవైన విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశారు. అయితే విద్యుత్ లైన్ పరిధిలో చెట్ల కొమ్మలు విద్యుత్ లైన్‌లకు తగులుతాయనే ఉద్దేశంతో గన్నవరం ప్రధాన రహదారి నుంచి గౌరిదేవిపేట వరకు రహదారి పక్కన ఉన్న వందల చరిత్ర కలిగిన చింతచెట్లను నరికివేశారు.

ఘనంగా ఉపాధ్యాయ దినోత్సవం

● ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



రౌతులపూడి: శ్రీను సన్మానిస్తున్న ఎమ్మెల్యేలు సత్యప్రభ, కొండబాబు, జగ్గంపేట: కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న వరలక్ష్మి కుమారి, కోటనందూరు: వెంకటరమణు సన్మానిస్తున్న దృశ్యం

జగ్గంపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట, కిర్లంపూడి, గండేపల్లి మండలాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ జగ్గంపేట సీడీపీవో పూర్ణిమ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జగ్గంపేటలో నిర్వహించిన కార్యక్రమానికి టీడీపీ మండలాధ్యక్షుడు జీను మణిబాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చిన్నారులతో కేక్‌కటింగ్ చేయించి స్వీట్స్ పంపిణీ చేశారు. సీడీపీవోను టీచర్లు సన్మానించారు. టీడీపీ నాయకులు దేవరపల్లి రామ్మూర్తి, సాయి సూపర్‌వైజర్లు అమ్మాజీ, సునీత, బుసమ్మ, కరీమున్నిసా, చందకళ, విద్యార్థుల తల్లులు పాల్గొన్నారు. అలాగే పలువురు ఉపాధ్యాయులకు జనసేన జగ్గంపేట ఇంచార్జ్ తుమ్మలపల్లి రమేష్ సన్మానం చేశారు. కార్యక్రమంలో మాదారపు వీరబాబు, కురుమల్ల నాగేశ్వరరావు, పాఠంశెట్టి రమేష్‌కాయల మణికంఠ, గందం శ్రీను, రేవూరి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఏలేశ్వరం, (ఆంధ్రజ్యోతి): స్థానిక పెన్షనర్స్ భవనంలో అసోసియేషన్ నేతృత్వంలో గురుపూజోత్సవం నిర్వహించారు. లయన్స్ క్లబ్ ట్రెజరర్ అలమం డ దుర్గా వెంకటప్రసాద్ హాజరయ్యారు. లయన్స్ క్లబ్, పెన్షనర్ల ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు ఉద్దగిరి సోమరాజు, పి.జోగిరాజు, ఏబీవీ ప్రసాద్, ఇబ్రహీం ఖాన్‌లకు శాలువాకప్పి పూలమాలలతో సత్కరించారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వసంత ప్రసాదరావు, తిరుపతి రావు, సత్యగాంధీ, తాతారావు, తూరౌతు గురవయ్య, ఊర రాజబాబు, ఉడతల రమణారావు పాల్గొన్నారు.

కోటనందూరు, (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా కేఏమల్లవరం ఎలిమెంటరీ పాఠశాల ఉపాధ్యాయుడు సుర్ల వెంకటరమణ ఎంపికయ్యారు. కాకినాడలో కలెక్టర్, ఎమ్మెల్యేల నుంచి అవార్డు అందుకున్నారు. లోవదేవస్థానం మాజీ చైర్మన్ గాడి రాజుబాబు, పోతల సూరిబాబు, డి.చిరంజీవిరాజు, ఎంఈవోలు ఎ.శ్రీనివాస్, ఎం.రాజశేఖర్ అభినందించారు.

కిర్లంపూడి, (ఆంధ్రజ్యోతి): జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడిగా బూరుగుపూడి ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయుడు కంకిపాటి ఆదినారాయణమూర్తి ఎంపికయ్యారు. శుక్రవారం కాకినాడలో కలెక్టర్ నుంచి ఆయన ఉత్తమ అవార్డు, ప్రశంసాపత్రం అందుకున్నారు. ఆదినారాయణమూర్తికి ఎంఈవో టి.జోసెఫ్, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారు.

జగ్గంపేట, (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట ఎంపీపీఎస్ ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వాకచర్ల వరలక్ష్మి కుమారి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఎంపికయ్యారు. శుక్రవారం కాకినాడలో కలెక్టర్ నుంచి అవార్డును అందుకున్నారు. పలువురు ప్రముఖులు ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

రౌతులపూడి,(ఆంధ్రజ్యోతి): జిల్లాఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు పొందిన యర్రాశ్రీనువాసు, గోడి ప్రసన్నకు ఎమ్మెల్యేలు వరుపుల సత్యప్రభ, వనమాడి కొండబాబు కాకినాడలో సన్మానించారు. మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్క రరావు, ఆసుపత్రి మాజీ చైర్మన్ కైశర్ల సత్యనారాయణ, అశోక్, స్వాతి పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలి



యనమలను సత్కరిస్తున్న ప్రత్తిపాడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు

తునిరూరల్, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి యనమల రామకృష్ణుడిని శుక్రవారం ఆంధ్రప్రదేశ్ ఖాదీ అండ్ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ కొమ్ముల కన్నబాబు మర్యాదపూర్వకంగా కార్యకర్తలతో కలిశారు. ఈసందర్భంగా ప్రత్తిపాడు నియోజకవర్గ కార్యకర్తలనుద్దేశించి యనమల మాట్లాడారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ నేతృత్వంలో నియోజకవర్గం అన్ని విధాల అభివృద్ధి పథంలో నడుస్తుందన్నారు. రాబోయే రోజుల్లో స్థానిక ఎన్నికల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం శ్రమించే ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం ఉంటుందన్నారు.

దసరా ఉత్సవాలకు శ్రీకారం



ఏలేశ్వరంలో దశమి వేడుకలకు శ్రీకారం చుట్టిన కమిటీ సభ్యులు

ఏలేశ్వరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో తోటవీధి దుర్గమ్మ ఆలయం వద్ద శుక్రవారం ఆలయ కమిటీ నేతృత్వంలో దసరా ఉత్సవాలకు అలమండ పెద చలమయ్య శైలజ దంపతుల కొబ్బరికాయలు కొట్టి పందిరి రాట వేసి ముహూర్తం చేశారు. ఈనెల 22నుంచి అక్టోబర్ 2వరకు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆలయం వద్ద ప్రతీ రోజు ఉదయం, సాయంత్రం కుంకుమ పూజలు నిర్వహిస్తామని మహిళలు, భక్తులు పాల్గొనాలన్నారు. చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, కౌన్సిలర్ అలమండ చలమయ్య, కోరాడ సత్యనారాయణ, సామంతుల గోపి, కోరాడ రామకృష్ణ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముస్లింల భారీ ర్యాలీ



ఏలేశ్వరంలో ఊరేగింపు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు

ఏలేశ్వరం, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మసీదులో మిలాద్-ఉన్-నబీ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పుర వీధుల్లో ముస్లింలు భారీ ర్యాలీ నిర్వహించారు. మసీదుల్లో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు చేశారు. కౌన్సిలర్ బొదిరెడ్డి గోవింద్ నివాసం వద్ద ముస్లిం సోదరులకు సాదర స్వాగతం పలికి పానీయాలు, పలహారం అందజేశారు.

వైభవంగా వినాయకుడి నిమజ్జనాలు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ముస్సిబ్ వారి రామాలయం వద్ద పూజలు అందుకున్న గణనాథుడిని గ్రామంలో ఊరేగించి పోలవరం కాలువలో నిమజ్జనం చేశారు. పెదశంకర్లపూడిలోని గణేష్ మండపాన్ని ఎమ్మెల్యే సత్యప్రభ సందర్శించి పూజలు నిర్వహించారు.

రోడ్లపై చెత్త వేయకుండా వ్యాపారస్తులు సహకరించాలి

జగ్గంపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి):రోడ్లపైచెత్తవేయకుం డా వ్యాపారస్తులు సహకరించాలని అధికారులు సూచించారు. జగ్గంపేట గ్రామ పంచాయతీ పరిధిలోని వర్తక వ్యాపారస్తులతో గురువారంరాత్రి పంచాయతీ అధికారులు సమావేశం నిర్వహించారు. జగ్గంపేట ఆర్యవైశ్య కల్యాణమండపంలో వర్తక సంఘం అధ్యక్షుడు పాలకుర్తి సురేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జగ్గంపేట పంచాయతీ అధికారి జి.శివ మాట్లాడుతూ జగ్గంపేట మెయిన్ రోడ్డు పురవీధుల్లో వ్యాపార కార్యకలాపాలు నిర్వహించే వర్తక వ్యాపారస్తులంతా చెత్త, చెదరాలను రోడ్లపై వేయకుండా జాగ్రత్తలు పాటించాలని తెలిపారు. ప్లాస్టిక్ వాడ కాన్ని పూర్తిగా నిషేధించాలని సూచించారు. కొత్త(వెంకటేశ్వ ర రావు) కొండబాబు, మానేపల్లి బంగార్రాజు, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



వ్యాపారస్తులతో మాట్లాడుతున్న ఈవో

గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా సత్యవేణి



గెద్దాడ సత్యవేణిని సన్మానించిన ఎమ్మెల్యే నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు5(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట జ్యోతుల నెహ్రూ కాలనీకి చెందిన టీడీపీ జగ్గంపేట టౌన్ మహిళ అధ్యక్షురాలు గెద్దాడ సత్యవేణిని ఏపీ గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా ప్రభుత్వం నియమించింది. శుక్రవారం జగ్గంపేట ఎమ్మెల్యే క్యాంప్ ఆఫీసులో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూను ఆమె మర్యాదపూర్వకంగా కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే ఆమెను సత్కరించి శుభాకాంక్షలు తెలియజేసి ఆశీస్సులు అందించారు. ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ, టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కు రుణపడి ఉంటానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎస్వీఎస్ అప్పలరాజు, జీను మణిబాబు, కొత్త కొండబాబు, దేవరపల్లి మూర్తి, పాండ్రంగి రాం బాబు, ఏలేటి బాబి, రాయి సాయి, పీలా మహేష్, కుంచే తాతాజీ, మురళి రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలిసిన కన్నబాబు



జ్యోతుల నవీన్‌ను కలిసిన కొమ్ముల కన్నబాబు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఖాదీ గ్రామీణ పరిశ్రమ మండలి డైరెక్టర్‌గా నియమితులైన ప్రత్తిపాడు సీనియర్ టీడీపీ నాయకుడు కొమ్ముల కన్నబాబు శుక్రవారం జిల్లాలోని టీడీపీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. భారీ వాహనాల కాన్వాయ్‌తో ప్రత్తిపాడు నుంచి తుని వెళ్లి టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు, ఎమ్మెల్సీ యనమల రామకృష్ణుడుని, తుని ఎమ్మెల్యే యనమల దివ్యను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం జగ్గంపేటలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్, పెద్దాపురంలో ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడలోని ఎమ్మెల్యే వనమాడి కొండబాబు, రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు, స్థానిక ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. టీడీపీ సీనియర్ నాయకులు అమరాది వెంకట్రావు, మిరియాల శ్రీను, యాళ్ల విశ్వేశ్వరరావు, యర్రాబత్తుల గోవిందనాయుడు, ఇళ్ళ అప్పారావు, మదినే స్వామి, పోలిశెట్టి శ్రీను, మదినే దొరబాబు ఉన్నారు.

తంటికొండ దేవస్థానాన్ని అభివృద్ధి చేస్తా



ఆలయ పునర్నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేస్తున్న ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ

జగ్గంపేట, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తంటికొండ దేవస్థానాన్ని పునర్ని ర్మాణం చేసి నియోజకవర్గ ప్రజలకు కానుకగా ఇస్తానని జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ అన్నారు. ఇందుకు ప్రత్యేక ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. శుక్రవారం గోకవరం మండలం తంటికొండ కొండపై స్వయంభూ శ్రీదేవి భూదేవి సమేత శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. దేవస్థా నం చైర్మన్ బదిరెడ్డి అచ్చన్న దొర ఆధ్వర్యంలో ఎమ్మెల్యేకు వేదపండితులు ఘన స్వాగతం పలికారు. గుడిని విశాలంగా నిర్మించేందుకు దేవదాయ ఉద్యోగులతో ఇంజనీర్లతో ఎమ్మెల్యే సమావేశం ఏర్పాటు చేశారు. నెహ్రూ మాట్లాడుతూ టీటీడీ బోర్డు మెంబర్‌గా తంటికొండ గుడిని అభివృది చేసి రానున్న పుష్కరాలకు ప్రజలకు కానుక అందిస్తామన్నారు. ఆలయ పునర్నిర్మాణంతో పాటు ముఖ, ప్రాకార మండపాలు, రాజగోపురం, ధ్వజస్తంభం అభివృద్ధి కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈశాన్యంలో విశాలమైన చెరువు ఉండడం వల్ల దానిని కోనేరుగా అభివృద్ధి చేస్తామన్నారు. కాలినడకన వచ్చే భక్తులకు కోనేరు వద్ద నుంచి కొండకు నడిచి వచ్చే విధంగా ప్రత్యేక మార్గం ఏర్పాటు చేస్తామని తెలిపారు.

'ధర్మవరం సొసైటీని భ్రష్టు పట్టించిన ముదునూరి'



మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం సొసైటీకి గతంలో అధ్యక్షుడిగా పని చేసిన ముదునూరి మురళీకృష్ణంరాజు ఆ సొసైటీలో అవినీతి, అక్రమాలకు పాల్పడి భ్రష్టు పట్టించారని ఒమ్మంగి సొసైటీ చైర్మన్, సీనియర్ టీడీపీ నాయకుడు సత్యంశెట్టి సీతారాం విమర్శించారు. ధర్మవరంలోని టీడీపీ తెలుగు రైతు కార్యదర్శి బొల్లు కొండబాబు నివాస గృహంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. మురళీరాజు ఎప్పుడు గెలిచే పార్టీలో ఉండలేదని, ఎన్నికల చివరి క్షణాల్లో ఒకసారి టీడీపీ నుంచి వైసీపీకి, మరో సారి వైసీపీ నుంచి టీడీపీకి మారడం అలవాటు అని విమర్శించారు. సమావేశంలో సీనియర్ టీడీపీ నాయకులు బి.కొండబాబు, దాట్ల కృష్ణబాబు, వెలుగుల నాని, బొల్లు వెంకటేశ్వరరావు, శ్రీపతి అప్పలరాజు, తోపాటి బాబురావు, రామిరెడ్డి ప్రసాద్, ముప్పనబోయిన ఏసుబాబు పాల్గొన్నారు.

చినశంకర్లపూడి ఆలయ గోపురానికి రూ.50వేల విరాళం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): చినశంకర్లపూడిలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ గోపుర నిర్మాణానికి జనసేన నాయకురాలు బార్లపూడి క్రాంతి రూ.50వేలు విరాళం అందజేశారు. సగర సంఘం పెద్దలు బార్లపూడి క్రాంతికి శాలువా కప్పి సన్మానించారు. బీసీ ఐక్య సంఘర్షణ సమితి నాయకులు ఏపూరి శ్రీనివాసరావు, చెలుబోయిన నాగేశ్వరరావు, ఏపూరి రాంబాబు, తంగెళ్ళ వెంకట రమణ, సూర్నీడి సురేష్, ముత్యాల సత్తిబాబు, చునుబోయిన శివ(బుజ్జి) జనసేన నాయకులు నల్లల రామకృష్ణ, ఆకేటి సుధాకర్, పిడుగు భద్రం, ఎస్.వెంకట శ్రీను పాల్గొన్నారు.

15న భవన నిర్మాణ కార్మికుల చలో విజయవాడ

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల ఛలో విజయవాడ ఆందోళన విజయవంతం చేయాలని ఏపీ బిల్డింగ్ కనస్ట్రక్షన్ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మెట్ల శ్రీను, ప్రధాన కార్యదర్శి రొంగల ఈశ్వరరావు కోరారు. సెప్టెంబరు 15న భవన నిర్మాణ కార్మికుల ఛలో విజయవాడను విజయవంతం చేయాలని కోరుతూశుక్రవారం ప్రత్తిపాడులో గోడపత్రికలను విడుదల చేశారు. కార్యక్రమంలో శీరం సత్తిబాబు, ఎ. నిరంజన్, రాజా, వీరబాబు, గానాల గంగాధర్, ధర్నాల కోట వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

నవోదయ ఉచిత శిక్షణా తరగతులు ప్రారంభం

ప్రత్తిపాడు, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం శాఖా గ్రంథాలయంలో హెల్పింగ్ ఆర్మ్స్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నవోదయ ఉచిత తరగతులను శుక్రవారం ప్రారంభించారు. ఫౌండేషన్ నిర్వాహకుడు చెక్కపల్లి ఆకాష్, తోపాటి ఫణీంద్రకానులు, బొడ్డిపట్ల రాజబాబు, దాసం శేషారావు, దాడి రమణ, నల్లా బాబ్జి, బాలిరెడ్డి ఆనంద్, రాయి రాణిబాబు పాల్గొన్నారు.

రేపు జాబ్‌మేళా

తునిరూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా చేపడుతున్న జాబ్‌మేళాను యువత సద్వినియోగం చేసుకోవాలని తుని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం తుని గర్ల్స్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహించే జాబ్ మేళాలో రాష్ట్ర నలుమూలల నుంచి ప్రముఖ కంపెనీలు హాజరుకానున్నాయని, టీడీపీ కార్యకర్తలు యువతను చైతన్యపరిచి జాబ్‌మేళాను విజయవంతం చేయాలన్నారు.

ఎల్ఐసీ 69వ వార్షికోత్సవం



తునిరూరల్, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): తునిలో ఎల్ఐసీ 69వ వార్షికోత్సవం ముగింపు కార్యక్రమం జరిగింది. ముఖ్యఅతిథిగా ఎంఈవో గీతాదేవి మాట్లాడుతూ ఎల్ఐసీకి ప్రజల్లో గొప్ప ఆదరణ ఉందన్నారు. వారం రోజులు నిర్వహించిన కార్యక్రమాల్లో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. బ్రాంచ్ మేనేజర్ సత్యనారాయణ, సందీప్‌రెడ్డి, శోభన్‌కుమార్, కేఎస్వీ సత్యనారాయణ పాల్గొన్నారు.

స్మార్ట్‌కార్డులతో ప్రతీ ఒక్కరికి రేషన్



రేషన్‌కార్డులు అందిస్తున్న దృశ్యం

కిర్లంపూడి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): నూతన స్మార్ట్ రేషన్‌కార్డుల ద్వారా ప్రతీ ఒక్కరికి సక్రమంగా రేషన్ అందుతుందని టీడీపీ నాయకులు కుంచే తాతాజీ, పాటంశెట్టి రవి అన్నారు. శుక్రవారం బూరుగుపూడి గ్రామంలో చౌకదుకాణాల వద్ద స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేశారు. చౌకదుకాణాల ద్వారా నెలంతా రేషన్ పొందవచ్చన్నారు. పాఠంశెట్టి విశ్వనాథం, నాగేశ్వరరావు, మూరా సత్తిబాబు, బాలిన వెంకటేశ్వరరావు, రాంశెట్టి రాజు, డీలర్లు ఉన్నారు.

భారీ అన్నదానం

జగ్గంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట శ్రీరామ్‌నగర్ కాలనీ గణేష్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. 3వేల మందిపై భక్తులు తరలివచ్చారు. టీడీపీ జగ్గంపేట మండలాధ్యక్షుడు జీను మణిబాబు, నియోజవర్గ తెలుగు యువత అధ్యక్షుడు దేవరపల్లి మూర్తి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ పీల వెంకటలక్ష్మి మహేష్ గణనాథుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

జగ్గంపేట, సెప్టెంబరు 5 (ఆంధ్రజ్యోతి): 11కేవీ జగ్గంపేట- నరేంద్రపట్నం ఫీడర్‌లో ఆర్‌డీఎస్ఎస్ పనుల కారణంగా శనివారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ వీరభద్రరావు తెలిపారు. బావవరం, కాండ్రేగుల గ్రామాలు, బోరులకు, బావవరం వాటర్ ప్లాంట్‌కి విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

గణనాథుల నిమజ్జనాలు



తునిరూరల్, సెప్టెంబరు 5(ఆం ధ్ర జ్యోతి): తేటగుంట, గవరపేట ఎస్ఎస్ఈ నగరం, ఎన్.సురవరం తదితర గ్రామాల్లో సంప్రదాయ నృత్యాలతో గణనాథుడి శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం కాల్వల్లో గణనాథులను నిమజ్జనం చేశారు.

కిర్లంపూడిలో అన్నదానం

కిర్లంపూడి, సెప్టెంబరు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక ఏనుగువీధిలో ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటుచేసిన గణనాథుడిని శుక్రవారం ప్రత్తిపాడు నియోజకవర్గ వైసీపీ కోఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు దర్శించుకున్నారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.